విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :87 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 17 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## విద్యార్థుల గొంతును ఇకపై ఎవరూ అణచలేరు

- 'మోదీ హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన యువత'
- విద్యార్థినుల ధైర్యాన్ని ప్రశంసించిన రాహుల్
- పేపర్ లీకులపై ఆందోళన చేసిన విద్యార్థులకు పోలీసుల వేధింపులంటూ రాహుల్ ఆరోపణలు
- శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- శాసన సభలో కూటమి.. మండలిలో వైసీపీ.. బయట జగన్
- అసెంబ్లీకి దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయం
- 'సభకు వస్తే డీఎస్సీ సహా ప్రతి ఆరోపణకూ సమాధానం ఇప్పిస్తా' అంటున్న స్పీకర్ అయ్యన్న
- ప్రతిపక్ష హోదాపై ఎవరి వాదన వారిదే.. మరోసారి రాజకీయ రగడ
- ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా వైసీపీ




**అమరావతి**

రాష్ట్ర రాజకీయాలకు మరోసారి శాసనసభ వేదిక సిద్ధమైంది. సోమవారం నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాల ఎజెండా, పనిదినాలు, చర్చకు వచ్చే అంశాలు ఒకవైపు ఆసక్తి రేపుతుండగా.. మరోవైపు ప్రధాన ప్రతిపక్ష పార్టీ వైసీపీ అనుసరించబోతున్న వ్యూహం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాబోమని ఇప్పటికే ప్రకటించారు. అయితే శాసనమండలిలో మాత్రం వైసీపీ ప్రతినిధులు హాజరై ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. దీంతో ఈసారి 'సభలో కూటమి.. మండలిలో వైసీపీ.. బయట జగన్' అన్నట్లుగా రాజకీయ చిత్రం కనిపించనుంది. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలంటే అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రశ్నలు--సమాధానాలు, ఆరోపణలు--ప్రత్యారోపణలు, వాడీవేడి చర్చలు కనిపిస్తాయి. కానీ ఈసారి అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు లేకుండానే సమావేశాలు - మిగతా3లో



## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు తొలగుతున్న అడ్డంకి

- చివరి దశకు చేరిన టీబీఎం తొలగింపు
- చురుగ్గా సాగుతున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు
- తుది దశకు చేరుకున్న టన్నెల్ బోరింగ్ యంత్రం తొలగింపు పనులు
- ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు

**మార్కాపురం**

మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామంలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే రెండో సొరంగం తవ్వేందుకు వినియోగించిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొలగింపు పనులు చివరి దశకు చేరుకున్నాయి. 18.89 కిలోమీటర్ల మేర రెండో సొరంగం తవ్వేందుకు ఈ యంత్రంతో 2009లో పనులు ప్రారంభించారు. 11.84 కిలోమీటర్ల మేర తవ్వకం పనులు 2019 వరకు కొనసాగాయి. ఆ తర్వాత - మిగతా3లో



## వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది

- వారికి క్షమాపణలు చెప్పాలి' అమిత్ షా డిమాండ్
- ప్రజలు, గేయరచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే వందేమాతరంను కాంగ్రెస్ విస్మరించిందని విమర్శ

## 'నా మిత్రులు నన్ను కలవడానికి వచ్చాయి'

ఎర్రకోటకు వెళ్లే ముందు ఆవులు, నెమళ్లతో మోదీ ముచ్చట్లు

ఎర్రకోటకు బయలుదేరే ముందు జంతు మిత్రులతో ప్రధాని మోదీ ఆత్మీయ క్షణాలు

ఆవులు, నెమళ్లకు ఆహారం అందిస్తూ, వాటితో ముచ్చటించిన ప్రధాని



## విశాఖకు విమానాల రాకపోకలు బంద్

ఇవాళ అర్ధరాత్రి నుంచి విశాఖ విమానాశ్రయం సేవలు సమాప్తం

భోగాపురం విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం

ఈ నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి విమానాలు నిలిపివేత



**అమరావతి**

ప్రతి ప్రాంతానికి ఒక చరిత్ర ఉంటుంది. అంతేకాకుండా, దానితో ముడిపడి ఉన్న ప్రత్యేక అనుభవాలు, అనుభూతులు ఉంటాయి. ఒక ప్రదేశం ఇకపై అక్కడ ఉండదని హఠాత్తుగా తెలిస్తే. తలచుకుంటూనే మనసంతా ఏదోలా ఉంది కదూ. ఇదంతా విశాఖ విమానాశ్రయం గురించే. ఎందుకంటే దీనికి 80 సంవత్సరాల చరిత్ర ఉంది. నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్?పోర్ట్? సేవలు సమాప్తం కానున్నాయి. దీంతో ఈ విషయాన్ని - మిగతా3లో




## ప్రధాని చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు విపక్షాలను ఉద్దేశించి కాదు

- నక్సల్స్‌కు మద్దతిచ్చేవారిని, రాజ్యాంగాన్ని తిరస్కరించేవారినే అన్నట్లు వెల్లడి
- ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత విమర్శలు

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- కేంద్రం పరిశీలనలో రెండో విడత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులు
- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. వాటా నిధుల కోసం హడ్కో రుణం విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. - మిగతా3లో

## పార్లమెంట్‌ను అణచివేసి రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు

- ఆ ప్రశ్నలను తిరస్కరించడంపై సీజేపీ ఫైర్
- ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' అత్యంత కీలకమైనది
- అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోంది
- నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని సౌరవ్ దాస్ ప్రశ్న



# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

సాగనున్నాయి. దీంతో సభలో ప్రభుత్వం ఏ అంశాలను ముందుకు తెస్తుంది? వైసీపీ చేస్తున్న ఆరోపణలకు అధికార పక్షం సభా వేదికగా ఎలాంటి సమాధానాలు ఇస్తుంది? మరోవైపు సభకు దూరంగా ఉన్న జగన్ ప్రభుత్వంపై ఎలాంటి రాజకీయ దాడి కొనసాగిస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది.

**జగన్ రూటే సెపరేటు**

ప్రతిపక్ష నేత హోదా అంశంపై జగన్ తన వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశారు. అసెంబ్లీలో తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా సమావేశాలకు హాజరుకావడంలో అర్థం లేదన్నది వైసీపీ వాదన. అందుకే తాను మాత్రమే కాకుండా పార్టీ ఎమ్మెల్యేలు కూడా సమావేశాలకు హాజరుకాబోరని జగన్ ప్రకటించారు. సభకు దూరంగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తామని వైసీపీ చెబుతోంది. ఇక్కడే అధికార కూటమి, వైసీపీ మధ్య ప్రధాన రాజకీయ వివాదం నెలకొంది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించాలని అధికార పక్షం అంటుంటే.. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన హోదా, హక్కుల విషయంలో ప్రభుత్వం రాజకీయంగా వ్యవహరిస్తోందన్నది వైసీపీ వాదన. ఈ రెండు వాదనల మధ్య అసెంబ్లీ సమావేశాలు మరోసారి రాజకీయ వేదికగా మారనున్నాయి.

**అయ్యన్న సవాల్‌తో మరింత వేడి**

ఈ నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. జగన్ అసెంబ్లీకి వచ్చి వైసీపీ చేస్తున్న ఆరోపణలను సభలో ప్రస్తావించాలని ఆయన సూచించారు. డీఎస్సీతో సహా వైసీపీ లేవనెత్తే ప్రతి అంశంపైనా సంబంధిత మంత్రులు, ప్రభుత్వం చేత సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. సభ వెలుపల ఆరోపణలు చేయడం కంటే సభకు వచ్చి ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నది స్పీకర్ వాదన. దీంతో 'ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నప్పుడు సభకు వచ్చి ఎందుకు ప్రశ్నించడం లేదు?' అన్న ప్రశ్నను అధికార కూటమి వైసీపీ వైపు సంధించే అవకాశముంది.

**హోదాపైనే పట్టు**

మరోవైపు ప్రతిపక్ష నేత హోదా విషయంలోనూ స్పీకర్ తన వైఖరిని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అవసరమైన సంఖ్యాబలం లేనప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదని ఆయన చెబుతున్నారు. వైసీపీ మాత్రం ఈ వాదనను అంగీకరించడం లేదు. ప్రతిపక్షంలో అత్యధిక స్థానాలున్న పార్టీ నాయకుడికి ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని వాదిస్తోంది. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అంశాలతో పాటు 'జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా' వ్యవహారం కూడా సభ వెలుపల ప్రధాన రాజకీయ చర్చగా కొనసాగనుంది. అధికార కూటమి, వైసీపీ రెండూ ఈ అంశాన్ని తమ తమ రాజకీయ వాదనకు అనుకూలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.

**డీఎస్సీ.. హాట్ టాపిక్**

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డీఎస్సీ అంశం ప్రధాన చర్చనీయాంశాల్లో ఒకటిగా మారింది. డీఎస్సీ నియామకాల విషయంలో అక్రమాలు జరిగాయని వైసీపీ ఆరోపిస్తోంది. ముఖ్యంగా కొన్ని నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదంటూ ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను తిప్పికొడుతోంది. ఇదే అంశాన్ని సభలో ప్రస్తావిస్తే పూర్తి వివరాలతో సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సంకేతాలు అధికార పక్షం నుంచి వస్తున్నాయి. స్పీకర్ కూడా డీఎస్సీ సహా అన్ని అంశాలపై సమాధానాలు ఇప్పిస్తానని ప్రకటించడంతో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో డీఎస్సీపై నేరుగా ప్రశ్నలు--సమాధానాల రూపంలో అధికార, ప్రతిపక్షాల మధ్య చర్చ జరిగే అవకాశం ఉండదు. ప్రభుత్వం సభలో తన వాదనను వినిపిస్తే.. వైసీపీ సభ వెలుపల నుంచి దానికి కౌంటర్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

**మండలిలో మాత్రం ముఖాముఖి**

అసెంబ్లీకి దూరంగా ఉండాలని నిర్ణయించిన వైసీపీ.. శాసనమండలిలో మాత్రం తన బలాన్ని ఉపయోగించుకోవాలని చూస్తోంది. పార్టీ ఎమ్మెల్సీలు సమావేశాలకు హాజరై ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై ప్రశ్నలు సంధించనున్నారు. దీంతో ఈసారి అధికార, ప్రతిపక్షాల మధ్య అసలు ముఖాముఖి రాజకీయ పోరు మండలిలోనే కనిపించే అవకాశం ఉంది. డీఎస్సీ, విద్య, ఉద్యోగాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తదితర అంశాలను మండలిలో వైసీపీ ప్రస్తావించే అవకాశముంది. ప్రభుత్వం కూడా ప్రతిపక్ష ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. దీంతో అసెంబ్లీ కంటే మండలి సమావేశాలు వాడీవేడిగా సాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ప్రభుత్వం ఏం చెబుతుంది?**

అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం కూడా రాజకీయంగా కీలక వేదికగా ఉపయోగించుకునే అవకాశముంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన తదితర అంశాలను సభ ద్వారా ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతోంది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు, పోలవరం, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం ప్రస్తావించే అవకాశముంది. గత ప్రభుత్వ పాలనతో ప్రస్తుత పరిస్థితులను పోల్చుతూ అధికార పక్ష సభ్యులు వైసీపీపై ఎదురుదాడికి దిగే అవకాశమూ లేకపోలేదు.

**సభలో ప్రతిపక్షం లేకపోతే..?**

ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరంగా ఉండటం సహజంగానే రాజకీయ చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం, అధికార పక్షాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రతిపక్షం ప్రధాన బాధ్యతల్లో ఒకటని అధికార కూటమి నేతలు వాదిస్తున్నారు. వైసీపీ మాత్రం సభలో తమకు తగిన హోదా, అవకాశాలు కల్పించకుండా కేవలం హాజరు కావాలని కోరడం సరికాదని చెబుతోంది. దీంతో 'సభకు ఎందుకు రావడం లేదు?' అన్న అధికార పక్ష ప్రశ్నకు.. 'ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదు?' అన్న ప్రశ్నతో వైసీపీ సమాధానం ఇస్తోంది. సమావేశాల సమయంలో ఈ రాజకీయ సంవాదం మరింత ముదిరే అవకాశముంది.

**బీఏసీలో ఎజెండా ఖరారు**

సభ ప్రారంభానికి ముందు జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో శాసనసభ పనిదినాలు, ఎజెండాపై నిర్ణయం తీసుకోనున్నారు. ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలి? ఏ అంశాలను చర్చకు తీసుకోవాలి? ప్రభుత్వం ఎన్ని బిల్లులు ప్రవేశపెట్టనుంది? ప్రశ్నోత్తరాలు, స్వల్పకాలిక చర్చలు, ఇతర శాసన వ్యవహారాలకు ఎంత సమయం కేటాయించాలి? వంటి అంశాలు బీఏసీలో ఖరారు కానున్నాయి. ప్రొవిజనల్ షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నాలుగు రోజుల పాటు సాగనున్నప్పటికీ బీఏసీ నిర్ణయమే కీలకం కానుంది. ప్రభుత్వం తీసుకురానున్న బిల్లులు, తీర్మానాలు కూడా సమావేశాల రాజకీయ ప్రాధాన్యాన్ని నిర్ణయించనున్నాయి.

# జెండా, అజెండా భారత్...

**విజయవాడ :** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడమే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఇచ్చే నిజమైన నివాళి అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు."ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. దేశం నాకు ఏం చేసిందని కాకుండా, దేశానికి నేను ఏం చేయగలనని ప్రతి ఒక్కరూ 'అనే నేను..' సంకల్పంతో ఆలోచించాలి" అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి చేతిలో జాతీయ జెండా, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' సాధించాలన్న లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు కోరారు. 0వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. "ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమే. అందుకు 'అనే నేను...' సంకల్పంతో దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలి. మన చేతిలో జాతీయ జెండా ఉండాలి... మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలి. 2047 నాటికి వికసిత్ భారత్... స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దాం." అని పిలుపునిచ్చారు. మన స్వాతంత్ర్య సమరయోధుల, దార్శనిక నాయకుల నుంచి శాశ్వతమైన స్ఫూర్తిని పొంది, వారి స్ఫూర్తిని దేశ నిర్మాణ కార్యంలో ముందుకు తీసుకువెళ్దాం. మన యువత స్పష్టమైన లక్ష్యంతో, నైతిక ధైర్యంతో నాయకత్వం వహించాలి. రాజకీయ విభజనలకు, సామాజిక విభేదాలకు అతీతంగా ఎదగాలి. ప్రతి పల్లెటూరు, పట్టణం, నగరంలోని ప్రతి పౌరుడు, రాబోయే తరాల కోసం బలమైన, సుసంపన్నమైన, స్వయం సమృద్ధిగల, నిజమైన వికసిత భారత్‌ను నిర్మించడానికి చిత్తశుద్ధితో తమ వంతు కృషి చేయాలి." అని రాసుకొచ్చారు. ఇది మన సమిష్టి ధర్మం అని, ఇది మన ఉమ్మడి గమ్యం అని పేర్కొన్నారు. ."100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు, వికాసం నుంచి వైభవం వైపు సాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి ఐక్యంగా అడుగులు వేద్దాం" అని ఆయన తెలిపారు. తన సందేశాన్ని 'జై తెలుగుతల్లి! జై హింద్!' నినాదాలతో ముగించారు

**పవిత్ర బాధ్యతగా భావించాలి: పవన్**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, తమ ధైర్యం, త్యాగం, దేశభక్తితో మనం ఈరోజు అనుభవిస్తున్న స్వేచ్ఛను సాధించిన స్వాతంత్ర్య సమరయోధులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. "మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ తేలికగా తీసుకోవలసిన బహుమతి కాదని, అది మన జాతీయ ఐక్యత, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడటానికి చేపట్టిన ఒక పవిత్ర బాధ్యత అని వారి జీవితాలు మనకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయి.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గడిచిన దశాబ్దాల్లో, దేశం నిశ్శబ్దమైన సంకల్పంతో, అద్భుతమైన ఆశయంతో ఎదిగింది. ప్రపంచ అంతరిక్ష శక్తిగా ఆవిర్భవించడం, చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో చారిత్రాత్మక ల్యాండింగ్ అవ్వడం నుంచి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం, యూపీఐ ద్వారా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను సృష్టించడం, మన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, ప్రపంచ వేదికపై ఒక ప్రధాన ఆర్థిక శక్తిగా స్థిరపడటం వరకు - ఈ విజయాలు భారత ప్రజల ప్రతిభకు, అకుంఠిత స్ఫూర్తికి సజీవ నిదర్శనం.విభజనతో దెబ్బతిన్న దేశాన్ని వారసత్వంగా పొంది, ఐక్యత, పునర్నిర్మాణం, ప్రగతి అనే ఉన్నత మార్గాన్ని ఎంచుకున్న ఆ మహనీయ రాజనీతిజ్ఞులకు, జాతినిర్మాతలకు నేను ప్రగాఢ గౌరవంతో నమస్కరిస్తున్నాను. వారి దార్శనికత, ధైర్యసాహసాలతో, నేడు మనం గర్వంగా నివసిస్తున్న ఈ భారత్‌కు వారు పునాదులు వేశారు.

# గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

**హైదరాబాద్ :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు.భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్



సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు.పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పుష్కరాలు విజయవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

-మొదటిపేజీ తరువాయి

అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది.

**4 నగరాల్లో ప్రతిపాదిత ప్రాజెక్టులు**

ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.600 కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు తొలగుతున్న అడ్డంకి

-మొదటిపేజీ తరువాయి

యంత్రంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దీంతో పనులు నిలిపివేశారు. సహజసిద్ధంగా బ్లాస్టింగ్ చేసి కాంక్రీట్ పూతతో మిగతా పనులు చేపట్టారు. ఇవి దాదాపు పూర్తికాగా, ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇక్కడ చిక్కుకుపోయిన యంత్రం బయటకు తీయడం సవాల్?గా మారింది. 180 మీటర్ల పొడవు, వెయ్యి టన్నులకుపైగా బరువు ఉన్న ఈ యంత్రాన్ని బయటకు తీసుకురావాలంటే ముక్కలుగా చేసి తరలించడం తప్ప మరో మార్గం లేదు. ఈ పనిని మే 29న ప్రత్యేక నిపుణులకు అప్పగించారు. వారు యంత్రం వెనుక వైపు నుంచి ఒక్కో భాగాన్ని వెల్డింగ్‌తో తొలగించడం ప్రారంభించారు. అనంతరం ఆ భాగాలను టిప్పర్‌లో బయటకు తీసుకొస్తున్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా టీబీఎంలో ఉండే కట్టర్ హెడ్‌ను తొలగించాల్సి ఉంది. ఇందుకోసం డైమండ్ కటింగ్‌లో నైపుణ్యం ఉన్న కార్మికులను తీసుకొచ్చారు. వారంలోగా పనులన్నీ పూర్తిచేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూస్తామని ఈఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

**కార్మికుల భద్రతకు అధికారుల చర్యలు**

మరోవైపు టన్నెల్‌లో పనులకు వెళ్లే కార్మికుల భద్రతకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. టన్నెల్‌లోకి వెళ్లే ప్రతి కార్మికుడికి ముందుగా ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు. టీబీఎం తొలగింపు, గ్యాస్ కట్టింగ్ పనులు చేసే సిబ్బందికి ప్రత్యేక దుస్తులు, మాస్కులు, చెవుల రక్షణ పరికరాలు అందిస్తున్నారు. వాహనాల రాకపోకల కోసం ప్రతి 400 మీటర్లకు రెడ్ సిగ్నల్, వాహనాలు పక్కకు తప్పుకునే ప్రాంతాలు ఏర్పాటు చేశారు. కార్మికుల కోసం అంబులెన్స్‌తో పాటు మెయిన్ సైట్‌లో 24 గంటలూ వైద్యుడు అందుబాటులో ఉంటారని వెలిగొండ భద్రతా అధికారి మంజునాథ్ వివరించారు.

## విశాఖకు విమానాల రాకపోకలు బంద్

-మొదటిపేజీ తరువాయి

కొందరు నగరవాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతలా వారికి దానితో అనుబంధం పెనవేసుకుపోయింది.

1941లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖ ఎయిర్?పోర్ట్?కి పునాది పడింది. రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అవసరాల కోసం బ్రిటిష్ పాలకులు ఈ ఎయిర్ ఫీల్డ్ నిర్మించారు. 'వింటేజ్ ఆర్కిటెక్' ముప్పిడి కుటుంబానికి రన్ వే నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 45 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఎత్తైన గుట్టలతో నిండిన ప్రాంతాన్ని వేగంగా చదును చేసి అనుకున్న సమయానికంటే ముందే రన్‌వే నిర్మించి ఇచ్చారు. తొలి పౌర విమాన రాకపోకలు (సివిల్ ఆపరేషన్స్) 1954లో ప్రారంభం కాగా నాడు రాకపోకలకు చాలా తక్కువగా అనుమతులిచ్చారు. పూర్తిస్థాయి వాణిజ్య విమాన సర్వీసులు 1981లో మొదలయ్యాయి. అప్పటి నుంచి పూర్తి సివిల్ ఎయిర్‌పోర్టుగా ఆపరేషన్స్ ప్రారంభమయ్యాయి. వ్యూహాత్మక భద్రతా కారణాలతో 1986లో భారత నావికాదళం చేతిలోకి ఈ ఎయిర్?పోర్ట్? వెళ్లింది. 1991లో దీనికి 'ఐఎన్‌ఎస్ డేగ' అని నామకరణం చేశారు. అప్పటి నుంచి నేవీ నియంత్రణలో ఉంటూ పౌర విమాన సర్వీసులు నడుపుతున్నారు.

పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు. ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్‌ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎయిర్ ఇండియా సింగపూర్‌కు మొట్టమొదటి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించడంతో విశాఖ గ్లోబల్ ఏవియేషన్ మ్యాప్‌లో నిలిచింది. మరోవైపు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం (ఆగస్టు 17) నుంచి విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విశాఖ ఎయిర్?పోర్ట్? నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 సంవత్సరాల పాటు వైజాగ్ విమానాశ్రయం నుంచి (ఐఎన్‌ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది.

**తొలి విమానం దేశీయమే**

వాస్తవానికి భోగాపురం ఎయిర్?పోర్ట్? నుంచి సింగపూర్‌కు తొలి విమానం ఇవాళ బయల్దేరుతుందని అనుకున్నారు. కానీ సోమవారం (ఆగస్టు 17)న ఉదయం సర్వీసులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురం విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. మరోవైపు నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి.

**బయల్దేరే సర్వీసులివే**

భోగాపురం నుంచి హైదరాబాద్‌కు సోమవారం(ఆగస్టు 17)న ఉదయం 8.55, 10.40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4.25, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయల్దేరనున్నాయి. దిల్లీకి ఉదయం 8.20, రాత్రి 10.45, బెంగళూరుకు మధ్యాహ్నం 2.55, రాత్రి 9.10, చెన్నైకి మధ్యాహ్నం 12.15, సాయంత్రం 6.35, కోల్‌కతాకు రాత్రి 7.50, ముంబయికి మధ్యాహ్నం 3.05, తిరుపతికి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

# సింహాచలంలో అప్పన్న స్వామిని దర్శించుకున్న యార్లగడ్డ దంపతులు.







**సింహాచలం, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. సింహాచలం చేరుకున్న యార్లగడ్డ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో అప్పన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ అప్పన్న స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# గోటేటి రామమూర్తి కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం.







- సోషల్ మీడియా ద్వారా సమస్య తెలుసుకున్న మంత్రి లోకేష్ స్పందన.
- 24 గంటల వ్యవధి లోనే విద్యుత్ కనెక్షన్.
- రెండు నెలల్లో ఇంటి నిర్మాణానికి పూర్తి చేస్తాం.
- అవిడి గోటేటి రామమూర్తి కుటుంబానికి తక్షణ సహాయం.
- నారా లోకేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు.
- రూ.5 లక్షలతో పక్కా ఇంటి నిర్మాణం.
- విద్యుత్, పెన్షన్, నిత్యావసరాలు, గృహోపకరణాలు అందించేందుకు చర్యలు.
- నారా లోకేష్ కు కృతజ్ఞతలు ఎమ్మెల్యే సత్యానందరావు.

**కొత్తపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** పేదల కష్టాలను గుర్తించి తక్షణమే పరిష్కరించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు తెలిపారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామమూర్తి కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే అవిడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందించి, కుటుంబ పరిస్థితిని పరిశీలించి తక్షణ సహాయం అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. గత కొంతకాలంగా గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రామకృష్ణ తదితరులు రామమూర్తి కుటుంబానికి నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటి సహాయాన్ని అందిస్తూ వస్తున్నారని తెలిపారు. కుటుంబానికి ప్రధాన సమస్యగా ఉన్న విద్యుత్ సౌకర్యాన్ని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి 24 గంటల వ్యవధి లోనే అందుబాటు లోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. విద్యుత్ లైన్ నుంచి సరఫరా తీసుకువచ్చి, అవసర మైన చోట కొత్తగా ఏడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు.

అదే విధంగా కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించేందుకు రూ.5 లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు హౌసింగ్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారని చెప్పారు. పి 4 పథకం కింద ఇంటి నిర్మాణానికి అవసర మైన గణాంకాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించే ప్రక్రియను చేపట్టారని, సుమారు రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంటికి అటాచ్డ్ బాత్‌రూమ్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు చెప్పారు. కుటుంబానికి ప్రస్తుతం అందుతున్న రూ.4 వేల పెన్షన్‌తో పాటు వారు అర్హత పొందే ఇతర సామాజిక భద్రతా పింఛన్ల పై కూడా అధికారులు పరిశీలన చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబానికి ఎదురవుతున్న హౌస్‌హోల్డ్ సమస్యను పరిష్కరించి, అర్హత మేరకు దివ్యాంగుల పెన్షన్ లేదా సీరియస్ ఇల్‌నెస్ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుటుంబానికి గ్యాస్ స్టవ్, సిలిండర్, వంట పాత్రలు, ఫర్నిచర్ తదితర అవసర మైన సామగ్రిని కూడా సమకూర్చినట్లు తెలిపారు. సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల విలువైన సామగ్రిని అందించడంతో పాటు కొంత మంది దాతలు కూడా ముందుకు వచ్చి కుటుంబానికి సహాయం చేస్తున్నారని చెప్పారు. ఎవరైనా పేద కుటుంబం కష్టాల్లో ఉందని తెలిసిన వెంటనే స్పందించి, వారికి అవసర మైన సహాయం అందించడమే కూటమి ప్రభుత్వ విధానం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రామమూర్తి కుటుంబం ఇక పై ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం, పార్టీ శ్రేణులు అండగా ఉంటాయి. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి అని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు భరోసా ఇచ్చారు. పేదల కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న వెంటనే స్పందించి, అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దించి విద్యుత్, వైద్యం, నివాసం, పెన్షన్, నిత్యావసరాలు వంటి అవసరాలను పరిష్కరిస్తున్న తీరు కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

# ఘనంగా సంపత్ వినాయక ఆలయ పసిడి కలశ ప్రతిష్ట.





## ఆలయ ప్రారంభోత్సవంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** బి.సి. కాలనీ లో ఆలయ ధర్మకర్త పయిల అప్పారావు (టి.వి) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంపత్ వినాయక ఆలయం పసిడి కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమం, అభిషేకాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక హారతులు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి, మండల పరిషత్ అధ్యక్షురాలు పయిల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస రావు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పయిల శ్రీనివాస రావు, జెడ్పీటీసీ పి.ఎస్. రాజు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, భక్తి, ధర్మం, సనాతన సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నూతనంగా నిర్మించిన గణపతి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని, స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పయిల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గణపతి స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి భవిష్యత్తులో కూడా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్. రాజు మాట్లాడుతూ దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా ప్రజలను ఐక్యం చేసే ఆధ్యాత్మిక కేంద్రాలని పేర్కొన్నారు. గణపతి ఆలయం భక్తులకు నిత్యం ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించే క్షేత్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలు, మామిడి తోరణాలు, అరటి చెట్లతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ మాజీ జెడ్పిటిసి పయిల జగన్నాధరావు,మాజీ సర్పంచ్ లు సిరిపురపు అప్పల నాయుడు, పయిల అప్పారావు, చుక్క రాము నాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పయిల రామచంద్ర రావు, పయిల సన్యాసి రావు, గ్రామ పెద్దలు, మండల ముఖ్య నాయకులు, బి.సి కాలనీ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి.

- సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి మంత్రి సవిత ఘన నివాళులు.



**తాడేపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో బీసీల సింహా, బీసీల ముద్దు బిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి మంత్రి సవిత ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస విడిచిపెట్టే వరకూ గౌతు లచ్చన్న పోరాటం చేసారన్నారు.

21 వ ఏటనే గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న యోధుడు గౌతు లచ్చన్న అని తెలిపారు.గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తి, ప్రజాసేవ, దేశభక్తి నేటి తరం యువతకు ఎంతో ఆదర్శం అన్నారు. గౌతు లచ్చన్న బాటలో సాగుతూ సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ముందంజలో నిలబెట్టేలా చంద్రబాబు కృషి చేస్తున్నారు. త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం అని తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి అని మంత్రి సవిత తెలిపారు.

## ఎయిర్ పోర్ట్ అంతర్గత భద్రత, ప్రయాణికుల భద్రతకు చర్యలు.

విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.





**విజయనగరం, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** ఈ నెల 17 నుండి భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుండి విమాన సర్వీసులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అరైవల్, డిపార్చర్ వద్ద వాహనాల పార్కింగ్, విఐపిల వాహనాల పార్కింగ్, సిఐఎస్ఎఫ్ సిబ్బంది చేపడుతున్న అంతర్గత భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పర్యవేక్షించి, అధికారులకు భద్రతాపర మైన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ ప్రారంభం సందర్భంగా ప్రయాణికుల భద్రతతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, ప్రధాన రహదారులు, జంక్షన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించ నున్నామని తెలిపారు. ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో నిరంతర పెట్రోలింగ్, సీసీటీవీ పర్యవేక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల పై ప్రత్యేక నిఘా, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడతామని, అత్యవసర పరిస్థితుల్లో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఎయిర్ పోర్ట్ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్ళే వాహనాలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం వైపు నుండి ఎయిర్ పోర్టుకు వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎయిర్ పోర్టు మార్గంలో బోర్డులను, స్టాపర్లను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి విమానాల్లో అరైవల్ అయ్యే వారు, ఇతర ప్రాంతాలకు డిపార్చర్ అయ్యే ప్రయాణికుల వాహనాలు నిలిపే స్థలాలను, వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం, ఎయిర్ పోర్ట్ అంతర్గత భద్రత విధులు నిర్వహించే సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ మమేకమై వారు నిర్వహించాల్సిన విధులు గురించి భద్రతాపర మైన సూచనలు చేశారు. ప్రయాణికుల లగేజ్ లను, పాస్పోర్ట్ లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ప్రయాణికులు, లగేజ్ పట్ల ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ఎయిర్ పోర్ట్ ఆవరణంలో భద్రత విధులు, ట్రాఫిక్, ఇమ్మిగ్రేషన్ విధులను నిర్వహించేందుకు త్వరలో స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందిని నియమిస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. అనంతరం ఎయిర్ పోర్ట్ ఆవరణ లోని వీఐపీ లాంజ్ లను, వెయిటింగ్ లాంజ్, బ్యాగేజ్, కమాండ్ కంట్రోల్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పరిశీలించి, అధికారులకు భద్రతాపర మైన సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట భోగాపురం సిఐ కే.దుర్గా ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఏవీ లీలారావు, ట్రాఫిక్ సిఐ రాము, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# గ్రూప్--1పై గోబెల్స్ ప్రచారం..

**తాడేపల్లి: పెన్ సత్తా, ఆగస్ట్ 16** గ్రూప్--1పై కూటమి ప్రభుత్వం సాగిస్తున్న గోబెల్స్ ప్రచారం వెనుక అసలు కుట్రను మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ బట్టబయలు చేశారు. సిట్ నివేదిక, ఏపీపీఎస్సీ సభ్యులు కోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో వాస్తవాలు స్పష్టంగా ఉన్నా వాటిని పక్కనపెట్టి గ్రూప్--1పై బురదజల్లడం రాజకీయ పన్నాగమేనని మండిపడ్డారు. డీఎస్సీలో బయటపడుతున్న అక్రమాలు, అవకతవకల నుంచి విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కాపాడేందుకు గ్రూప్--1 అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రూప్--1పై ఏ ఆధారాలతో ప్రచారం చేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలని, అదే సమయంలో డీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పి తీరాలని ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. ప్రెస్‌మీట్‌లో ఆదిమూలపు సురేష్ ఏమన్నారంటే..

- సిట్ నివేదికే సమాధానం

"గ్రూప్--1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. సిట్ నివేదికలో శాస్త్రీయ ఆధారాలతో అక్రమాలు జరిగినట్లు ఎక్కడా నిర్ధారణ కాలేదు. ఏపీపీఎస్సీ సభ్యులు కోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో కూడా హైలాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం జరగలేదని స్పష్టంగా పేర్కొన్నారు. అయినా వాస్తవాలను వక్రీకరించి గ్రూప్--1పై బురదజల్లడం ఎందుకు? ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి."

- పారదర్శకంగా జరిగిన మూల్యాంకనంపై దుష్ప్రచారం

"గ్రూప్--1 మెయిన్స్ పత్రాల మూల్యాంకనం ఎవాల్యుయేటర్లు, స్క్రూటినైజర్లు, చీఫ్ ఎగ్జామినర్ల పర్యవేక్షణలో జరిగింది. అవసరమైతే రెండోసారి, మూడోసారి కూడా మూల్యాంకనం జరిగే విధానం ఉంది. మూడో వ్యక్తి జోక్యానికి అవకాశం లేని ఈ ప్రక్రియను అక్రమంగా చిత్రీకరించడం రాజకీయ దుష్ప్రచారం తప్ప మరొకటి కాదు. ఐదుగురు ఏపీపీఎస్సీ సభ్యులు సంతకాలతో దాఖలు చేసిన అఫిడవిట్‌లోని వాస్తవాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి."

- డీఎస్సీ అక్రమాలపై సమాధానం ఎక్కడ?

"గ్రూప్--1 అంశాన్ని తెరపైకి తెచ్చి డీఎస్సీలో జరుగుతున్న అక్రమాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. డీఎస్సీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యవహారం, స్పోర్ట్స్ కోటా నియామకాలు సహా అనేక అంశాలపై అధికారిక లేఖలు, ఆధారాలు ఉన్నాయి. గ్రూప్--1పై విచారణలకు సిద్ధమంటున్న ప్రభుత్వం డీఎస్సీపై విచారణకు ఎందుకు వెనుకడుగు వేస్తోంది? లోకేశ్‌ను కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా డీఎస్సీలో జరిగిన అక్రమాల వాస్తవాలను ఎవరూ దాచిపెట్టలేరు" అని ఆదిమూలపు సురేష్ తేల్చిచెప్పారు.

# కూటమి ప్రభుత్వంలో ఆటవిక పాలన

**తాడేపల్లి, నెల్లూరు: పెన్ సత్తా, ఆగస్ట్ 16** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య విలువలు మంటగలిసి ఆటవిక పాలన సాగుతోందని వైఎస్సార్సీపీ నేతలు మండిపడ్డారు. తాడేపల్లి, నెల్లూరు పార్టీ కార్యాలయాల్లో జరిగిన విలేకరుల సమావేశాల్లో పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ (ుజు) నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఎటువంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం ముమ్మాటికీ కక్షసాధింపు చర్యలేనని తేల్చి చెప్పారు. డీఎస్సీ-2025 నిర్వహణలో ప్రశ్నాపత్రాల లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో నకిలీ సర్టిఫికెట్లతో అక్రమ నియామకాలు, జీవోల ట్యాంపరింగ్ వంటి భారీ కుంభకోణాలు సాక్ష్యాధారాలతో బట్టబయలైనా ప్రభుత్వం దబాయింపు ధోరణి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఈ అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, డీఎస్సీ అక్రమాలతో పాటు గ్రూప్-1 వ్యవహారంపై కూడా సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ (జదీ×) చేత సమగ్ర దర్యాప్తు జరిపించాలని వైఎస్సార్సీపీ తరపున డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరేమన్నారంటే..

ఉపాధ్యాయుల మెడపై టెట్ కత్తి పెట్టి వేధిస్తున్నారు: నలమారు చంద్రశేఖర్ రెడ్డిలి

రాష్ట్రంలో దాదాపు 30 సంవత్సరాలకు పైగా సర్వీస్ పూర్తి చేసుకుని, రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పాస్ కావాలనే నిబంధన పెట్టడం తీవ్ర అన్యాయం. 55-60 ఏళ్ల వయసులో మళ్లీ అన్ని సబ్జెక్టులు చదివి, ఓసీలకు 90%, బీసీలకు 70%, ఎస్సీ-ఎస్టీలకు 60% మార్కులు సాధించాలనడం ఎంతవరకు సబబు? ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరితే కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు.

రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో, టీచర్ల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీల సహకారంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఢిల్లీ వెళ్లి కేంద్ర విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఎయిర్‌పోర్టులో తమ ప్రజాప్రతినిధులతో ఫోటో దిగినంత మాత్రాన కాండక్ట్ రూల్స్ ఉల్లంఘించారని అనంతపురం, కడప జిల్లాలకు చెందిన నలుగురు టీచర్ లీడర్లను అక్రమంగా సస్పెండ్ చేశారు. ఎటువంటి ముందస్తు వివరణ అడగకుండా ఉద్యోగ సంఘాల నాయకులను సస్పెండ్ చేయడం నా 40 ఏళ్ల సర్వీసులో ఎప్పుడూ చూడలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు దాటినా పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఉద్యోగ సంఘాల నేతలపై విధించిన సస్పెన్షన్ వేటును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపుపై తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలి.

టీచర్లను సస్పెండ్ చేయడం దారుణం

లక్ష మందికి పైగా ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేసి, పాస్ అయితేనే ప్రమోషన్.. లేదంటే ఉద్యోగానికి ముప్పు అనే పరిస్థితి తీసుకురావడం అన్యాయం. ఇప్పటికే ఉద్యోగ పరీక్షలు రాసి, ఏళ్లుగా సేవలందిస్తున్న టీచర్లకు మళ్లీ అన్ని సబ్జెక్టులు చదివి టెట్ రాయాలని చెప్పడం ఎలా సాధ్యం? వారికి శిక్షణ ఇవ్వాలి కానీ మెడపై కత్తి పెట్టినట్లు పరీక్షను తప్పనిసరి చేయకూడదు. టెట్ నుంచి మినహాయింపు కోరుతూ ఎమ్మెల్సీలు, ఎంపీల ద్వారా కేంద్రానికి ప్రాతినిధ్యం వహించడానికి ఢిల్లీ వెళ్లిన టీచర్ సంఘ నాయకులను ఎలాంటి వివరణ, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గం. ప్రజాప్రతినిధులను కలవడం, తమ సమస్యలను కేంద్రానికి చెప్పడం ఉద్యోగుల హక్కు. డీఎస్సీ పేరుతో అసలు అంశాన్ని పక్కదారి పట్టించకుండా వెంటనే సస్పెన్షన్లు రద్దు చేయాలి. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

డీఎస్సీ అక్రమాలపైనా, ఏపీపీఎస్సీపైనా సీబీఐ విచారణకు సిద్దమా? : ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి.

రాష్ట్రంలో ప్రశ్నించే మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ నిర్బంధ పాలన కొనసాగిస్తున్నారు. డీఎస్సీ-2025లో జరిగిన అవకతవకలపై 3 లక్షల మంది అభ్యర్థుల గొంతుకగా వైఎస్సార్సీపీ పోరాడుతోంది. ఒక్కో డీఎస్సీ ఉద్యోగాన్ని రూ. 13 లక్షల నుంచి 15 లక్షలకు అమ్ముకున్నారు. క్వశ్చన్ పేపర్ లీకేజీతో పాటు జీవో 4, జీవో 47 వంటి దొంగ జీవోలు తెచ్చి అక్రమాలకు పాల్పడ్డారు. తప్పులు బయటపడటంతో ఆ జీవోలను ఉపసంహరించుకున్నారు.

టీడీపీ ఎమ్మెల్యే కోన రవికుమార్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హోదాలో నిబంధనలకు విరుద్ధంగా సంతకాలు పెట్టి ఇచ్చిన సర్టిఫికెట్లతో 35 మందికి అక్రమంగా టీచర్ ఉద్యోగాలు కట్టబెట్టారు. ఈ అక్రమాలపై మేము ఆధారాలు చూపిస్తుంటే ప్రభుత్వ వెబ్‌సైట్లలో డాక్యుమెంట్లను పదేపదే ట్యాంపరింగ్ చేస్తున్నారు. డీఎస్సీ అవకతవకలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీ-2025తో పాటు ఏపీపీఎస్సీ గ్రూప్-1 రిక్రూట్‌మెంట్‌పై కూడా సీబీఐ విచారణ వేయాలి.

# మహిళలకు వంచన, దగా రెట్టింపు చేశారు.

- ఎన్నికల్లో డబ్బులు పంచలేదని చంద్రబాబు ప్రమాణం చేయగలడా?.
- సూటిగా ప్రశ్నించిన వరుదు కళ్యాణి.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 16:** విశాఖ లోని వైఎస్సార్సీపీ సిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పత్రికా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు దగాను, వంచనను మాత్రమే రెట్టింపు చేశారని, మహిళల ఆత్మగౌరవాన్ని రెట్టింపు చేయలేదని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖ లోని వైఎస్సార్సీపీ సిటీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు డ్వాక్రా, ఉచిత బస్సు మహిళలతో చంద్రబాబు నిర్వహించిన తేనీటి విందు మహిళల సమస్యలకు సమాధానం చెప్పే కార్యక్రమం కాదని, ఒక పచ్చి 'పబ్లిసిటీ స్టంట్' అని విమర్శించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారం లోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా, ఇప్పుడు అదే మహిళలకు నీతులు చెప్పడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.18 వేల ఆర్థిక సాయం, ఆడబిడ్డ నిధి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు, నిరుద్యోగ భృతి, 3 సెంట్ల స్థలం, ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలను ఏమి చేశారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రూ. 1,80,000 కోట్ల బాకీ ఎగనామం, రూ. 3 వేల కోట్ల బోగస్ కబుర్లు,

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం, జూన్ నుంచే లెక్కవేసుకున్నా ఈ 25 నెలల కాలానికి మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం బాకీ పడిన మొత్తం అక్షరాలా రూ. 1,80,000 కోట్లు. ఇంత భారీ మొత్తాన్ని ఎగనామం పెట్టి, ఏదో రూ. 3,000 కోట్లు ఇచ్చేశానని పచ్చి అబద్ధాలు చెబుతారా? ఆ మూడు వేల కోట్లు ఏ అకౌంట్లో వేశారో తక్షణం సమాధానం చెప్పాలన్నారు.

ఓటుకు నోటు పితామహుడు చంద్రబాబే:

మహిళలు రూ. 2 వేలు తీసుకుని ఓట్లు వేస్తున్నారని, వారికి ప్రశ్నించే నైతిక హక్కు లేదని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనం. అసలు ఈ దేశంలో 'ఓటుకు నోటు' సంస్కృతిని తెచ్చిందే చంద్రబాబు కదా? అన్నారు. నాడు తెలంగాణలో ఎమ్మెల్యేలను కొంటూ దొరికిపోయి, హైదరాబాద్ లాంటి ఉమ్మడి రాజధానిని, 2 లక్షల కోట్ల ఆస్తులను వదిలేసి పిరికివాడిలా పారిపోయి వచ్చింది మీరు కాదా?, వేల కోట్లు దోచుకుంటున్న చంద్రబాబు మహిళలను లంచగొండులు అనడం సిగ్గుచేటు అన్నారు.

ఉచిత బస్సు కాదు.. ఆర్టీసీని అమ్మే కుట్ర:

మేనిఫెస్టోలో ఎలాంటి షరతులు లేకుండా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి, తీరా అధికారం లోకి వచ్చాక కేవలం 5 వేల పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకే పరిమితం చేసి మహిళలను దారుణంగా మోసం చేశారు. సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో మహిళలకు ఎందుకు స్థానం లేదు?, నిన్నటి సదస్సులో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విజయనగరం నుంచి వైజాగ్‌కి ఫ్రీ బస్సులో వస్తుందని స్కిట్లు వేయించి అడ్డంగా దొరికిపోయారు. ఈ ఉచిత బస్సు పేరుతో క్రమంగా ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే భారీ కుట్రకు చంద్రబాబు తెరలేపారు.

సున్నా వడ్డీ ఏదీ? సూపర్ సిక్స్ ఏమైంది?:

ఆనాడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా మహిళల కోసం రూ. 4,800 కోట్లు కేటాయించి ఠంచనుగా సున్నా వడ్డీ అమలు చేశారు. అధికారం లోకి రావడం కోసం 3 లక్షల నుంచి 10 లక్షల వరకు రుణాలకు సున్నా వడ్డీ ఇస్తామని నమ్మించి, తీరా ఇప్పుడు 3 లక్షల రుణానికి కూడా సున్నా వడ్డీ ఇవ్వకుండా మహిళల నోట్లో మట్టి కొట్టారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 'ఆడబిడ్డ నిధి', నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్, 3 సెంట్ల స్థలం.. ఈ సూపర్ సిక్స్ హామీలన్నీ ఏమయ్యాయి? అని ప్రశ్నించారు.

మహిళల భద్రత కోసం జగనన్న తెచ్చిన 'దిశా చట్టాన్ని' రద్దు చేసి మహిళల ఆత్మగౌరవాన్ని రోడ్డున పడేశారు. ఈరోజు రాష్ట్రంలో లక్షకు పైగా బెల్ట్ షాపులు తెరిచి, గంజాయి, డ్రగ్స్, మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ఇదా మీరు మహిళలకు ఇచ్చే భద్రత?, తాలిబొట్లు తెంచే ఈ పాలనతోనా మహిళల ఆత్మగౌరవం పెరిగేది? అన్నారు. తిరుమల శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేయగలరా?. నిత్యం వెంకటేశ్వర స్వామితో వర్చువల్‌గా మాట్లాడతాను అని ప్రగల్భాలు పలికే చంద్రబాబు నాయుడికి వైఎస్సార్సీపీ సవాల్ విసురుతోంది. నేను ఎన్నికల్లో ఒక్క రూపాయి కూడా పంచలేదు అని తిరుమల శ్రీవారి సాక్షిగా మీరు ప్రమాణం చేయగలరా?, ఈ రాష్ట్ర మహిళలు అమాయకులు కారు, ఒకసారి మీ అబద్ధాలను నమ్మి మోసపోయారు కానీ, పదే పదే మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. పాలిచ్చే తల్లులకు.. తప్పు చేసే పాలకుల అంతు చూడటం, ప్రభుత్వాలను కూలదోయడం కూడా బాగా తెలుసు!, ఇప్పటి కైనా మాయమాటలు మాని, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. లేనిపక్షంలో, ఈ రాష్ట్రం లోని మహిళలంతా ఏకమై వైఎస్సార్సీపీ అండతో మీ ప్రభుత్వానికి చరమగీతం పాడటం ఖాయం అని కళ్యాణి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# లైబ్రేరియన్ శ్యామలరావు కు జాతీయ అత్యుత్తమ సేవా పురస్కారం.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 16:**

మద్రాస్ లైబ్రేరియన్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం ప్రకటించే అవార్డులు 2026 వ సంవత్సరానికి గొన్న ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్ గా పనిచేస్తున్న ఆకెళ్ళ శ్యామలరావు కు దక్కింది. ఈ అవార్డు చెన్నై లో అన్న సెంటినరీ లైబ్రరీ లో జరిగిన కార్యక్రమంలో ద్రవిడియన్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్. ఎం. దొరస్వామి చేతుల మీదుగా అందుకోనున్నారు. లైబ్రేరియన్ గా చేసిన కృషి కి ఈ గుర్తింపు దక్కిందని శ్యామలరావు అన్నారు. ఈ అవార్డు రావడం తో లైబ్రరీ కి చేసిన కృషి కి మంచి గుర్తింపు లభించిందని శ్యామల రావు అన్నారు. కళాశాల సెక్రటరీ హేమ్ చంద్ నాయుడు, ప్రిన్సిపాల్ డా. మూర్తి, తోటి ఆచార్యులు శ్యామలరావు కు అభినందనలు తెలియచేసారు.



# శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం.








- మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం.
- భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం.
- ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం.
- డాక్టర్ మురళీమోహన్, ఎపి స్టేట్ అధ్యక్షులు, ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 16:**

శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం, సామాజిక వనాలు పెంచుదాం అని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ స్టేట్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎం వి వి మురళి మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి, సి టి జి, మన కూరగాయల తోట సంస్థల నేతృత్వంలో తాటి పళ్ళు, విత్తనాల బంతులు, మామిడి టెంకలు, కొంకుడుకాయ, గంగ రావి, నేరేడు, సీతాఫలం తదితర రకాల విత్తనాలు మధురవాడ లోని ఎన్ వి పి లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండల మీద విద్యార్థులతో చల్లిన తర్వాత ఆయన మాట్లాడారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం అని పిలుపు నిచ్చారు. ఎల్ నినో, సూపర్ ఎల్ నినో నేపథ్యంలో వస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసర మైన కృషి చేయాలని కోరారు. ప్రధానంగా శీతోష్ణస్థితి వేడెక్కకుండా ఉండడానికి సామాజిక వర్ణాలు పెంచడం ప్రతి ఒక్కరు బాధ్యత అన్నారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. రేపటి తరాన్ని పర్యావరణహితంగా జీవించేందుకు అవసరమైన అవగాహన కల్పించాలని కోరారు. అందుకే తాను తన మనవలకు పర్యావరణ పరి రక్షణ కోసం అవగాహన కల్పిస్తున్నామని, విత్తనాలు, విత్తనాలు బంతులు కొండల మీద విసిరేందుకు తీసుకువస్తున్నానన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవి రత్నం మాట్లాడుతూ ప్రతి దేశ విత్తనం మొక్కై మొలకెత్తేందుకు కృషి చేయాలి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం అని, ఆ పంటలనే భుజిద్దామని పిలుపునిచ్చారు. తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం అని కోరారు. మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తనాల బంతులు తయారు చేసి కొండల మీద, మైదాన ప్రాంతాల్లో చల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యా నేచురల్స్ మధుసూదన రెడ్డి, వనమాలి, సిటిజి, మనకూరగాయలతోట ప్రతినిధులు ఉష, కవిత,యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు 50 మందికి పైగా పాల్గొన్నారు.

# స్థానికంలో బీసీ రిజర్వేషన్లు లేనట్లే..? చంద్రబాబు సంకేతాలు



: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు.ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు.

ఇక రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లు పెంచాలని చూసినా సుప్రీం కోర్టు తీర్పు కారణంగా బ్రేక్ పడింది. దీంతో అక్కడ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించారని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులతో రిజర్వేషన్లు పెంచుకోవాలని చూసినా, అందుబాటులో ఉన్న కులాల లెక్కలతో కేవలం 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచేందుకే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానికంలో బీసీ రిజర్వేషన్లపై ఆలోచన మార్చుకున్నట్లు చెబుతున్నారు.ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమయ్యేలా లేదని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మోడల్ ను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేయకపోయినా కూటమిలోని మూడు పార్టీలు కలిపి 34 శాతం స్థానాలలో బీసీలను పోటీపెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. శనివారం కూటమి పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని చెబుతున్నారు. దీంతో స్థానికంలో బీసీ రిజర్వేషన్ పెరిగే పరిస్థితి కనిపించడం లేదన్న విషయం స్పష్టం అవుతోందని అంటున్నారు.

# జగన్ కు లేదా స్వాతంత్ర్యం!.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి వైఖరిపై మీడియా సర్కిల్స్ లో విస్తృత చర్చ జరుగుతోందని చెబుతున్నారు. శనివారం దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుకుంటే, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మాత్రం కేవలం ఒక్క ట్వీట్ తో సరిపెట్టడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జెండా వందనం చేయాల్సివుండగా, ఆయన ఎక్కడా స్వాతంత్ర్య సంబరాల్లో పాలు పంచుకోలేదని చెబుతున్నారు. విపక్షంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనలేదని, అంతకు ముందు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జెండా వందనం చేసేవారని అంటున్నారు.మాజీ సీఎం జగన్మోహనరెడ్డి జెండా వందనం చేయకపోవడంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో గతంలో ఒకసారి ఆయన జెండా వందనం చేసిన సమయంలో జనగణమన గీతాన్ని సరిగా ఆలపించలేదని ఆరోపిస్తూ విస్తృతంగా ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విషయమై వైసీపీ సోషల్ మీడియా నుంచి కూడా ఎటువంటి స్పందన, కౌంటర్లు లేకపోవడమే హాట్ టాపిక్ అవుతోంది.ఇక జగన్ రెడ్డికి అధికారం తప్ప, దేశంపై బాధ్యత లేదంటూ టీడీపీ అనుకూల మీడియాలో విమర్శలు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రతి పౌరుడు జెండా వందనం చేయడం ఒక బాధ్యతగా భావించాలని వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేయడమే కాకుండా, 2011 నుంచి ఒక ప్రధానమైన పార్టీని నడుపుతున్న నాయకుడిగా జగన్ రెడ్డి ఎక్కడో ఒక చోట జెండా వందనం చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.సహజంగా ఆగస్టు 15, జనవరి 26 వేడుకల్లో నాయకులు, అధికారులు విధిగా జెండా వందనం చేస్తుంటారు. అధికారంలో ఉంటే వారి బాధ్యతలకు తగ్గట్టు నిర్దేశిత స్థలాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు, ఇతర ప్రైవేటు సంస్థలు ఉన్న చోట ఆయా కార్యాలయాల వద్ద జెండా ఎగుర వేస్తుంటారు. అయితే శనివారం జరిగిన 80వ స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ సీఎం జగన్ రెడ్డి ఎక్కడా ఈ కార్యక్రమం నిర్వహించలేదని చెబుతున్నారు. తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. జగన్ రెడ్డి అందుబాటులో లేకపోవడం వల్ల ఆయన ఈ కార్యక్రమానికి చేశారని చెబుతున్నారు. అయితే బెంగళూరులో ఉన్న జగన్ రెడ్డి అక్కడైనా జెండా ఆవిష్కరిస్తే బాగుండేది, అనవసర విమర్శలకు తావిచ్చే పరిస్థితి వచ్చేది కాదని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.




# 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు 'సప్తధార': ఏడేళ్లలోనే దశాబ్దాల ప్రగతి సాధ్యమేనా?

భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో పూర్తి స్థాయి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే బృహత్తర లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మరొక అత్యంత కీలకమైన వ్యూహాత్మక అడుగు వేసింది. దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సాంకేతిక, రక్షణ, వ్యవసాయ, మౌలిక వసతుల రంగాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పోటీలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'సప్తధార' అనే నూతన ప్రణాళికను ప్రకటించారు. గత కొన్ని దశాబ్దాలుగా వేగంగా మారిన అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రాబోయే ఐదేళ్ల నుంచి ఏడేళ్ల అతిస్వల్ప కాలంలోనే ఊహించని రీతిలో వేగవంతమైన ప్రగతిని సాధించడమే ఈ నూతన కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

ఈ 'సప్తధార' వ్యూహంలో భాగంగా దేశ భవిష్యత్ ప్రగతికి అత్యంత కీలకమైన ఏడు రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ముందుకు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి దేశీయ ఉత్పత్తిని పెంచడానికి తయారీ రంగాన్ని భారీగా విస్తరించడం, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలకు భారత్‌ను ప్రధాన తయారీ కేంద్రంగా మార్చడం తొలి ప్రాధాన్యతగా మారనుంది. దీనితో పాటుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తూ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి విస్తృత ఊతాన్ని అందించడం ద్వారా ఉత్పత్తులకు సరైన విలువను జోడించి రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం సాధ్యమవుతుంది.

సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న ప్రస్తుత యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ వంటి అత్యాధునిక రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృక్పథంతో ముందుకు వెళ్తోంది. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు యువతలో నైపుణ్యాభివృద్ధి ద్వారా భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రగామిగా నిలిచే అవకాశం ఉంది. ఇక రక్షణ రంగంలో పూర్తి స్థాయిలో 'ఆత్మనిర్భరత' సాధించి, స్వదేశీ పరికరాల తయారీని పెంచడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులను పెంచే కార్యాచరణ సైతం ఇందులో భాగమై ఉంది. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు , డిజిటల్ మౌలిక వసతుల వేగవంతమైన కనెక్టివిటీ దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని అంచనా వేస్తున్నారు.



మరొకవైపు పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన ప్రగతి కోసం పునరుత్పాదక ఇంధనం, సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాల ద్వారా గ్రీన్, బ్లూ ఎకానమీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటితో పాటు భారతీయ సాంస్కృతిక ముద్ర అయిన యోగా, ఆయుర్వేదం , సంప్రదాయ జ్ఞానాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేయడం ద్వారా దేశ సాఫ్ట్ పవర్‌ను బలపరచడం కూడా ఈ ఏడు ధారల సమ్మేళనంలో భాగమై ఉంది.

అయితే కొన్ని దశాబ్దాలుగా సాధ్యం కాని అభివృద్ధిని రాబోయే ఏడేళ్లలోనే సాధించాలనే ఈ గొప్ప ఆలోచన కార్యరూపం దాల్చాలంటే విధానాల రూపకల్పనతో పాటు క్షేత్రస్థాయిలో సరైన అమలు అత్యంత కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సమర్థవంతమైన సమన్వయం, ప్రైవేట్ రంగం నుంచి వస్తున్న భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, నిరంతర నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు ఈ ప్రణాళిక విజయవంతం కావడానికి ప్రాథమిక పునాదులుగా నిలుస్తాయి. సమగ్ర ప్రణాళికతో ఈ ఏడు రంగాలపై ఏకకాలంలో దృష్టి సారించగలిగితే 'వికసిత్ భారత్' కల కేవలం ఒక స్వప్నంగా మిగిలిపోకుండా.. నిర్ణీత కాలపరిమితిలోనే సాకారమయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# పనిచేసిన చేతబడి ప్రచారం..!!
# భయంతో రూ.19 లక్షలు రిటన్ చేసిన దొంగ



: మంత్రాలకు చింతకాయలు రాలుతాయో లేదో కానీ, మంత్రాలు వేయిస్తాం, దొంగను పట్టేస్తాం అన్న ప్రచారానికి ఒక దొంగ మాత్రం హడలిపోయాడు. రెండు వారాల క్రితం దొంగతనం చేసిన నిందితుడు, బాధితులు చేతబడి చేయిస్తే తన ఆచూకీ తెలిసిపోతుందనే భయంతో రూ.19 లక్షల నగదును తిరిగి ఇచ్చేశాడు. అంతేకాకుండా తన వాటా డబ్బు తిరిగి ఇచ్చేస్తున్నానని, తన పాటనర్ల సమాచారం మాత్రం అడగొద్దని, చేతబడి చేయొద్దు అంటూ వేడుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది.పల్నాడు జిల్లా కేంద్రం నరసారావుపేటలో గత నెల 30న జరిగిన చోరీ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఘటన జరిగి రెండు వారాలు అయినా నిందితుల ఆచూకీ లేకపోయినప్పటికీ, దొంగ మాత్రం స్వచ్ఛందంగా రూ.19 లక్షల నగదును బాధితులకు తిరిగి ఇచ్చేసి ఆశ్చర్యపరిచాడు. ఇలా దొంగ తాను చోరీ చేసిన డబ్బును వెనక్కి ఇవ్వడానికి ప్రధాన కారణం దొరికిపోతాననే భయమేనని అంటున్నారు. తన ఆచూకీ తెలుసుకోడానికి బాధితులు చేతబడి చేయిస్తున్నారని విస్తృతంగా జరిగిన ప్రచారంతో దొంగ భయపడ్డాడని, చోరీచేసిన డబ్బును గుట్టుచప్పుడు కాకుండా బాధితుల ఇంటి ముద్దు పెట్టాడని చెబుతున్నారు. అంతేకాకుండా డబ్బుతోపాటు ఒక లేఖను రాసిన దొంగ తనను ఇక్కడితో వదిలేయాలని వేడుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.నరసారావుపేటలోని ప్రకాశ్ నగర్ బాలాజీ ఆర్కేడ్ అపార్టమెంటులో నివాసం ఉంటున్న ఆదినారాయణరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులు గత నెల 30న సమీమ బంధువు మరణించారని తెలిసి రొంపిచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లారని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దొంగలు ఆ రోజు రాత్రి ఇంట్లో చొరబడి రూ.25 లక్షల నగదు, 317 గ్రాముల బంగారంతో ఉడాయించారు. ఆదినారాయణరెడ్డి దంపతులు మరునాడు ఇంటికి వచ్చి చూసిన తర్వాత దోపిడీ విషయం వెలుగుచూసింది. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలిలో ఆధారాలు సేకరించారు. దొంగల వేలిముద్రలతోపాటు సీసీ పుటేజీ సేకరించాలని భావించారు. అయితే అపార్టమెంటులో సీసీటీవీ పుటేజీలో దొంగల ఆచూకీ లభ్యం కాకపోవడం, ఆదినారాయణరెడ్డి ఇంట్లో ఎవరూ లేరన్న పక్కా సమాచారంతోనే దొంగతనం జరిగినట్లు భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నారని అంటున్నారు. అయితే ఘటన జరిగి సుమారు 15 రోజులు అవుతున్నా ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు తమ సొత్తు ఎలా పోయిందో తెలుసుకోవాలని అంజనం వేయించాలని భావించారని అంటున్నారు.ఈ విషయంపై పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరగడంతో శనివారం ఉదయం ఆదినారాయణరెడ్డి ఇంటి ముందు చెప్పుల స్టాండులో రూ.19 లక్షల నగదుతో ఒక బ్యాగు కనిపించిందని చెబుతున్నారు. ఆ బ్యాగులో డబ్బుతోపాటు ఒక లేఖ కూడా ఉంది. తాను చేసిన పొరపాటును తెలియజేసిన దొంగ తన వాటా రూ.19 లక్షలు తిరిగి ఇచ్చేస్తున్నానని, మిగతా డబ్బు విషయంపై మాత్రం తనను అడగొద్దని ప్రాధేయపడ్డాడు. అంతేకాకుండా చేతబడి చేయొద్దని వేడుకున్నాడు. దీంతో పోలీసులకు భయపడని దొంగ, చేతబడి ప్రచారంతో హడలిపోయాడని భావిస్తున్నారు. అయితే డబ్బుతో బ్యాగు దొరికిన విషయాన్ని బాధితులు పోలీసులకు తెలియజేయడంతో దొంగతనం తెలిసిన వారి పనే అయివుంటుందని అనుమానిస్తున్నారు. ఇక ఇటీవల ఇటువంటి ఘటన తునిలో కూడా జరిగిందని చెబుతున్నారు. దొంగతనం చేసిన దుండగులు గ్రామపెద్దలు వెలివేస్తారనే భయంతో చోరీ సొత్తును బాధితుల ఇంటి ముందు పారేసి వెళ్లిపోయారని చెబుతున్నారు.

# విశాఖను ఎంచుకున్న నితిన్ నబీన్ !



బీజేపీకి జాతీయ అధ్యక్షుడు అయ్యాక నితిన్ నబీన్ ఏపీకి రావడం ఇదే తొలిసారి. అయితే ఆయన ఏపీ పర్యటనలో భాగంగా మొదటిగా అడుగుపెట్టే ప్రాంతంగా విశాఖపట్నాన్ని ఎంచుకున్నారు. ఆయన ఏపీకి ఇలా వచ్చి అలా వెళ్ళిపోవడం లేదు, అయిదు రోజుల పాటు ఏపీలోనే ఉండబోతున్నారు. విశాఖనే కేంద్రంగా చేసుకుని ఆయన ఏపీ బీజేపీ బలోపేతానికి దిశా నిర్దేశం చేస్తారని తెలుస్తోంది. ఇక చూస్తే ఇప్పటికే తెలంగాణాకు రెండు మూడు సార్లు వచ్చి వెళ్ళిన నితిన్ నబీన్ ఏపీకి మొదటిసారి రావడం విశేషం. రాజకీయ కార్యక్షేత్రంగా విశాఖను ఎంపిక చేసుకోవడం మరో విశేషం.

**భోగాపురం నుంచే నేరుగా :**

ఇక భోగాపురం ఎయిర్ పోర్టు తన ఆపరేషన్స్ ని స్టార్ట్ చేసే ఈ నెల 17నే నితిన్ నబీన్ అదే ఎయిర్ పోర్టులో ఢిల్లీ నుంచి విమానంలో ల్యాండ్ అవుతున్నారు. అక్కడ నుంచి నేరుగా ఆయన విశాఖ చేరుకుంటారు. ఇక నితిన్ నబీన్ అయిదు రోజుల బిజీ షెడ్యూల్ కూడా పార్టీ ఖరారు చేసింది. ఆయన విశాఖలో పార్టీ సమావేశాలను నిర్వహిస్తారని అంటున్నారు. అలాగే 17 నుంచి 21 వరకూ ఏపీలో ఉంటారని తెలుస్తోంది. ఆగస్టు 17 సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న నితిన్ నబీన్ కి బీజేపీ నేతలు, కార్యకర్తల ఘన స్వాగతం పలుకుతారు. ఆగస్టు 18 ఉదయం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం విశాఖలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం నిర్వహిస్తారు అని పార్టీ వర్గాలు తెలిపాయి.

**ఏపీ మీద ఫోకస్ :**

లోకల్ బాడీ ఎన్నికలు తొందరలో ఏపీలో నిర్వహించబోతున్నారు. బీజేపీకి అయిదు శాతం సీట్లు ఇస్తారని అంటున్నారు. అయితే తమ వాటా పెంచాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. ఇదే సమయంలో ఏపీకి వస్తున్న నితిన్ నబీన్ దీని మీద పార్టీ రాష్ట్ర శాఖకు కూడా సూచనలు చేయవచ్చు అని అంటున్నారు. ఇక ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండడంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అవుతారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇక ఏపీలో ఆయన ఎక్కడెక్కడ పర్యటిస్తారు అన్నది కూడా పార్టీ వర్గాల నుంచి సమాచారం రావాల్సి ఉంది. ఏపీలో బీజేపీ ఎదుగుదల మీద నితిన్ నబీన్ ఫోకస్ పెట్టారని అంటున్నారు.


**పార్టీకి బిగ్ టాస్క్ :**

తెలంగాణాలో అధికారం దిశగా ఆశలు పెంచుకుంటున్న బీజేపీ ఏపీలో నిర్ణయాత్మకమైన శక్తిగా అవతరించాలని భావిస్తోంది. అయితే ఏపీలో బీజేపీ అంత యాక్టివ్ గా లేదని వార్తలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యువకుడు అయిన బీజేపీ కొత్త అధ్యక్షుడు పార్టీ పటిష్టత గురించి క్యాడర్ కి లీడర్ కి చెప్పాల్సింది చెబుతారు అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి ఏపీలో బీజేపీని పూర్తిగా బలోపేతం చేయడమే నితిన్ నబీన్ అజెండాగా ఉంది. తెలంగాణాలో ఇప్పటికే పార్టీ నేతలకు టాస్క్ ఇచ్చిన ఆయన ఏపీలో బీజేపీకి కూడా లక్ష్యాన్ని నిర్దేశించి వెళ్తారని అంటున్నారు.

# విద్యార్థుల గొంతును ఇకపై ఎవరూ అణచలేరు

నీట్ పేపర్ లీక్ సహా వివిధ పరీక్షల అక్రమాలపై ఆందోళనలకు దిగిన విద్యార్థులపై కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, అధికారాన్ని ప్రశ్నిస్తూ నిలబడిన భారత యువత ధైర్యం, పట్టుదలను కొనియాడారు. ముఖ్యంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థినులు ఎదుర్కొన్న వేధింపులు, దూషణలు, హింసను ప్రస్తావిస్తూ వారికి తన మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'జవాబుదారీతనం కోసం పోరాడుతూ, మోద హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన భారత యువత ధైర్యం, స్థైర్యం ప్రశంసనీయం. శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది. అధికారాన్ని ప్రశ్నించడం, తమ హక్కుల కోసం నిలబడటం ప్రజాస్వామ్యంలో కీలకం. బీజేపీ కార్యకర్తల నుంచి దురుసు ప్రవర్తన, మాటల దాడులు, హింసను ఎదుర్కొన్నప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. కొంతమందిని ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పే పరిస్థితికి కూడా నెట్టారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న ప్రతి ఒక్క యువతిపై తనకు గర్వంగా ఉంది. ఇక వారి గొంతులను ఎవరూ అణచలేరు. విద్యార్థులు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్'**



ఇక విద్యార్థులతో తన సమావేశాలను కొనసాగించనున్నట్లు రాహుల్ తెలిపారు. ఆగస్టు 22న పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్' పేరుతో మరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసమే నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఇప్పుడు అమ్మాయిలు మాట్లాడతారు. దేశం వింటుంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నేరుగా వినడం, వారి అనుభవాలను దేశ ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**ఆగస్టు 5న విద్యార్థులతో భేటీ**

రాహుల్ గాంధీ ఈ నెల 5న విద్యార్థులతో సమావేశమైన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులు ఆయనతో కలిసి మీడియా ముందుకు వచ్చారు. వారిలో మోడల్ రియా అహిర్ కూడా ఉన్నారు. ముంబైలో విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటూ ఆమె నిలబడిన ఫొటో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. తనపై ఆన్‌లైన్‌లో వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రియా అహిర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

ఇక దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్ని కూడా రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఈ నిరసనలు చీకటిలో వెలుగు దివ్వెలా నిలిచాయని, తమ భయాల్ని పక్కనబెట్టి పోరాడిన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే సమస్యల్ని పరిష్కరించేందుకు ద్వేషం, హింసను ఆశ్రయించబోమని స్పష్టం చేసిన రాహుల్ గాంధీ 'ప్రేమ, ఆప్యాయతతో వ్యవస్థను మారుస్తాం' అని చెబుతూ, యువత కూడా అదే మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు హాజరయ్యారు. తీవ్రంగా కురిసిన వర్షానికి మైదానంలో నీళ్లు నిలిచిపోవడం, బురద పేరుకుపోయి నప్పటికీ పెద్ద ఎత్తున యువత కార్యక్రమానికి తరలివచ్చారు. రాహుల్ గాంధీ రాకకు ముందు ముంబయికి చెందిన ర్యాపర్లు డ్యాన్స్ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ముందు రోజు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అంతకుముందు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందుల్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిపారు

# పార్లమెంట్‌ను అణచివేసి రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు

లోక్‌సభ సమావేశాల్లో నీట్-యూజి 2026 పరీక్షా అక్రమాలు, విద్యార్థుల ఆందోళనలపై లేవనెత్తిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో తిరస్కరించడంపై కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' అత్యంత కీలకమైనదని, దీనిని అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోందని ఆయన విమర్శించారు. అనేక వారాల పాటు సాగిన నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. "ఇటీవల ముగిసిన లోక్‌సభ సమావేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలోని యువజన నిరసనలకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతించకపోవడం ఆందోళనకరం. లోక్‌సభ ఎంపీ మాథేశ్వరన్ వి.ఎస్. మూడు సెట్ల ప్రశ్నల (నోటీసు రిఫరెన్స్ నెం. 101799, 101801) ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి సమాధానాలు కోరారు. ఈ ప్రశ్నలను పార్లమెంటులో అడగలేకపోతే, ప్రభుత్వాన్ని ఎక్కడ జవాబుదారీగా చేయాలి? నిరసనల ద్వారానా? ఆ కీలక వారాల్లో హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు ముందుకు వచ్చి, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేదు

నీట్-యూజీ 2026 అభ్యర్థులకు రీఫండ్‌లు, పేపర్ లీక్ ఆందోళనలు, దిల్లీలో నిరసనకారులకు నీరు వంటి ప్రాథమిక



సౌకర్యాలను నిరాకరించడం, శాంతియుత ప్రదర్శనల పట్ల ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలను ఎంపీ అడిగారు. అయితే, రూల్ 41(2) కింద అనేక నిబంధనలను ఉటంకిస్తూ ప్రశ్నలను పార్లమెంటరీ అధికారులు తిరస్కరించారు. "పార్లమెంటును ఏయే అంశాలపై సమాధానాలు కోరారో మీరే చూడండి. 1. నీట్-యూజీ 2026 దరఖాస్తు ఫీజుల రీఫండ్ 2. ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా అపనమ్మకం 3. దిల్లీలో సీజేపీ నిరసనకారులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను నిరాకరించడం 4. నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై ప్రభుత్వ వైఖరి 5. విద్యార్థుల సంక్షేమం, పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలు 6. శాంతియుత నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కును వినియోగించుకుంటున్న పౌరుల పట్ల వైఖరి. అయితే, ఈ ప్రశ్నలను రూల్ 41(2) వివిధ క్లాజులను ఉటంకిస్తూ తిరస్కరించారు" అని సీజేపీ నేత సౌరవ్ దాస్ అన్నారు. ఇలా ప్రజాస్వామ్య సంస్థలు సభలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరాకరించినప్పుడు, పౌరులకు తమ నిరసనలను వీధుల్లోకి తీసుకువెళ్లడం తప్ప మరో మార్గం ఉండదని సౌరవ్? దాస్ అభిప్రాయపడ్డారు. ఎంపీలను ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడం, ప్రభుత్వం- ప్రజల మధ్య వారధిగా పార్లమెంట్ పోషిస్తున్న పాత్రను బలహీనపరుస్తుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల కార్యనిర్వాహక నిర్ణయాలకు పార్లమెంట్? ఒక 'రబ్బర్ స్టాంప్'గా మారుస్తుందని అన్నారు. "కార్యనిర్వాహక వర్గాన్ని ప్రశ్నించే ఎంపీ హక్కు ఏదో విధానపరమైన సమస్య కాదు. అది వాస్తవానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటిది. అపారమైన ప్రజా అధికారాన్ని కలిగి ఉన్న మంత్రులు ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులకు జవాబు చెప్పాల్సి ఉంటుంది కాబట్టే ప్రశ్నోత్తరాల సమయం ఉంది. లేకపోతే, ప్రజలు రోడ్లపైకి రావాల్సి వస్తుంది. మీరు పార్లమెంట్‌ను అణచివేసి మీ అసంపూర్ణ విధానాలకు దానిని రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు. మీరు యువతను విస్మరించలేరు. ఇది మా దృష్టిలో భారతదేశం కాదు!" అని సౌరవ్ దాస్ అన్నారు. నీట్ పరీక్షల అక్రమాలకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ నెలలో జబీూ ఆధ్వర్యంలో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశవ్యాప్త నిరసనలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వంతో చర్చల అనంతరం జూలై 25న ఆందోళనలను తాత్కాలికంగా విరమించినప్పటికీ, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

# ప్రధాని చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు విపక్షాలను ఉద్దేశించి కాదు

పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు విపక్షాలను ఉద్దేశించి కాదని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చారు. మావోయిస్టులకు మద్దతిచ్చేవారిని, రాజ్యాంగాన్ని తిరస్కరించేవారిని ఉద్దేశించి మోదీ, అలాంటి వ్యాఖ్యలు చేశారని రిజిజు చెప్పారు. వేర్పాటువాదుల పక్షాన నిలిచేవారు, ఆర్టికల్ 370కి మద్దతిచ్చేవారు, ఈశాన్య భారతంలో చికెన్ నెక్‌ను వేరు చేయాలని పిలుపు ఇచ్చేవారినే అలా అన్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించినప్పటికీ మేధో నక్సల్స్ ముప్పు ఇంకా పొంచి ఉందని ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ శనివారం చెప్పారు. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తప్పుబట్టారు. మేధో నక్సల్స్ అనే పదం ఎక్కడాలేదన్నారు. రెండు, మూడేళ్ల క్రితం రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అనే పదంతో ప్రధాని విమర్శించేవారిని ఆయన చెప్పారు. మేధో నక్సల్స్ అనే పదం కూడా అలాంటిదేనని అన్నారు. కుల గణన కోసం డిమాండ్ చేసే వారి ఆలోచనలు అర్బన్ నక్సల్స్ మాదిరిగా ఉన్నాయని, గతంలో ప్రధాని విమర్శించినట్లు జైరాం రమేష్ పేర్కొన్నారు. ఏడాది తర్వాత కులగణనకు ఆయన ఆదేశించారని చెప్పారు. ప్రత్యర్థులను తొలుత విమర్శించడం, తర్వాత వారి డిమాండ్లను అంగీకరించడం ప్రధానికి అలవాటేనని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే మేధో నక్సల్స్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు వివరణ ఇచ్చారు.

**అసలు మోదీ ఏమన్నారు?**

దేశంలో నక్సల్? ప్రభావం తగ్గినప్పటికీ, అలాంటి భావజాలం కలిగిన వారు ఇంకా సమాజంలో ఉన్నారని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం వివిధ సంస్థలను, కార్యకలాపాలను ప్రభావితం చేసిందని తెలిపారు. అలాంటి




వారిని గుర్తించి ఏరిపారేయాల్సిన అవసరం ఉందని ఆరోపించారు. ఎందుకంటే వాళ్లు, అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, దేశాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వికసిత్? భారత్ కోసం యువత ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించిందని పేర్కొన్నారు.

**మోదీ వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన సీజేపీ**

మరోవైపు, మోదీ మేధో నక్సల్స్ వ్యాఖ్యలపై కాక్రోచ్ జనతా పార్టీ కూడా ఘాటుగా స్పందించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన చదువుకొన్న యువతపై ప్రధాని అటువంటి ముద్ర వేయడం తగదని సీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి సౌరవ్‌దాస్ మండిపడ్డారు. మీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే కారణంతోనే ఇలా అంటారా?' అని ప్రశ్నించారు.

"ప్రధానమంత్రి, ఇలాంటి నిందలు పనిచేయవు. చదువుకున్న యువత మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించగానే అంత మాట అనడం, పూర్తిగా దురహంకారానికి నిదర్శనం. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తి అసమర్థత" అని వ్యాఖ్యానించారు. 'గంటలు మోగుతున్నాయి. మేల్కొలుపు మొదలైంది' అని సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సహజమైన ప్రక్రియ అని, ప్రశ్నించే వారిని భయపెట్టడం లేదా ఒక ముద్ర వేయడం సరికాదన్నారు. ఇప్పటివరకు మౌనంగా ఉండాలని చెప్పిన ఒక తరం ప్రస్తుతం తనకు అందుబాటులో ఉన్న వేదికలను కనుగొంటోందని తెలిపారు. ఏదీ మారదని చెప్పిన తరం, ఇప్పుడు మార్పు సాధ్యమేనని నమ్మడం ప్రారంభించిందని అన్నారు. దేశంలో శాంతియుత నిరసనల యుగం మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశాంతంగా నిరసన తెలిపేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో నెలకొన్న భయం బంధనాల నుంచి విముక్తం కావడంతో, బహుశా పన్నెండేళ్ల తర్వాత ఇది దేశ ప్రజలు జరుపుకొంటున్న అసలైన స్వాతంత్ర్య దినోత్సవమని సౌరవ్ మరో ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

## 'వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది

జాతీయ గేయం వందేమాతరంను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ గేయాన్ని రచించిన బంకిం చంద్ర చటోపాధ్యాయతోపాటు దేశ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఓ సభలో పాల్గొన్న అమిత్ షా, శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో వందేమాతరం గేయాన్ని మధ్యలోనే ఆపేయాలని సోనియా కోరినట్లు ఆరోపించారు. ఆ దృశ్యాలను దేశమంతా టీవీల్లో చూసిందన్నారు. వందేమాతరాన్ని పాడినందుకు స్వాతంత్ర్య సమరయోధులు తూటాలు, లాఠీ దెబ్బలను తిన్నారని, జైలు పాలయ్యారని అమిత్ షా గుర్తు చేశారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే హస్తం పార్టీ వందేమాతరం గేయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత ఎర్రకోటతో పాటు జెండా ఆవిష్కరణ జరిగిన అన్ని చోట్లా వందేమాతరం ఆలపించారని తెలిపారు. "సోనియా జీ, 140 కోట్ల మంది ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారు. మీరు చేసిన ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. 'వందేమాతరం' గేయాన్ని అసంపూర్ణంగా వదిలేయాలని ఎవరైనా ఎలా ఆలోచించగలరు? కాంగ్రెస్ పార్టీ దీనికి సిగ్గుపడాలి" అని అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 'అటల్ గౌరవ్ స్మృతి సమారోహ్'లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 21 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోఖ్రాన్ పరీక్షల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారతదేశాన్ని అణు శక్తిగా మార్చడంతో సహా వాజ్‌పేయీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. వాజ్‌పేయి ప్రభుత్వం తన హయాంలో గ్రామాలను రోడ్లతో అనుసంధానించిందని, జాతీయ రహదారులను నిర్మించిందని గుర్తుచేశారు. గిరిజన అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా వాజ్‌పేయీదేనని ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గిరిజన సంక్షేమానికి నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.

**సోనియా గాంధీపై బీజేపీ నేతల ఫిర్యాదు**

మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఆదివారం కర్ణాటకలోని ఉర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తన జాతీయ గేయాన్ని అగౌరవపరచడమేనని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకత్వం జాతీయ గేయం 'వందేమాతరం' పట్ల తీవ్రమైన అగౌరవాన్ని కలిగి ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని, కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉందని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని బీజేపీ అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. అయితే, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది. ఎక్కువసేపు నిల్చొని ఉన్న ఖర్గేకు కుర్చీ వేయాల్సిందిగా సోనియా సైగ చేశారని, గేయాన్ని ఆపాలని కాదని క్లారిటీ ఇచ్చింది.

## 'నా మిత్రులు నన్ను కలవడానికి వచ్చాయి'



ప్రధాని నరేంద్రమోదీ తన దైనందిన జీవితంలో వన్యప్రాణులకు ఎంత ప్రాముఖ్యత ఇస్తారో అందరికీ తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో తన నివాసంలో ఆవులు, నెమళ్లతో కొంత సమయం గడిపారు. వాటికి ఆహారం అందిస్తూ, ఆప్యాయంగా ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియా వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. సాధారణంగా రోజూ ఉదయం వాటికి ఆహారం అందిస్తానని మోదీ పేర్కొన్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాను ముందుగానే బయలుదేరాల్సి రావడంతో, తన జంతు మిత్రులు కూడా ఆ విషయాన్ని పసిగట్టినట్టుగా అనిపించిందన్నారు. అందుకే ఎర్రకోటకు బయల్దేరే సమయంలో తనను కలిసేందుకు వచ్చాయని తెలిపారు. చివర్?లో 'స్పెషల్? యాజ్? ఆల్వేస్' అని ఇన్స్టా పోస్ట్?లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్? మీడియా తెగ వైరల్ అవుతోంది.

ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో తన అధికారిక కార్యక్రమాలతో పాటు ప్రకృతి, జంతువులకు సంబంధించిన వ్యక్తిగత అనుభవాలను కూడా అప్పుడప్పుడూ పంచుకుంటుంటారు. తాజా పోస్టు కూడా అలాంటి అరుదైన వ్యక్తిగత కోణాన్ని ఆవిష్కరించింది. దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆయన షెడ్యూల్ సాధారణంగా అత్యంత బిజీగా ఉంటుంది. జాతీయ పతాకావిష్కరణ, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగం, ఇతర అధికారిక కార్యక్రమాల మధ్య, ఉదయం తన జంతు మిత్రులతో గడిపిన క్షణాలను పంచుకోవడం ప్రత్యేకంగా నిలిచింది.

**ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ**

జంతు మిత్రులతో ఆత్మీయ సమయాన్ని గడిపిన అనంతరం మోదీ ఎర్రకోటకు చేరుకున్నారు. అక్కడ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నేతృత్వం వహించారు. చారిత్రక ఎర్రకోట ప్రాకారాలపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వదేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 తుపాకుల గౌరవ వందనం నిర్వహించారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని మరోసారి ప్రస్తావించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. దేశ ఆర్థిక ప్రగతి, తయారీ రంగం, సాంకేతికత, ఆవిష్కరణలు, రక్షణ, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రసంగంలో ప్రాధాన్యత కనిపించింది. కీలక రంగాల్లో విదేశీ ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. తయారీ రంగంతో పాటు ఆహార ప్రాసెసింగ్, సాంకేతిక పరిజ్ఞానం, కనెక్టివిటీ, రక్షణ రంగం, పచ్చ ఆర్థిక వ్యవస్థ, సముద్ర ఆధారిత ఆర్థిక రంగం వంటి వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

**బన్నీ గడ్డిభూముల్లో 20 కృష్ణజింకలు**


ఇదిలా ఉండగా, 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, గుజరాత్‌లోని కచ్‌లో ఉన్న బన్నీ గడ్డిభూముల్లో 20కృష్ణ జింకలను విడిచిపెట్టారు. స్థానికంగా వన్యప్రాణుల సంఖ్యను పెంచడానికి, బన్నీ గడ్డిభూముల్లో పర్యావరణ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి గుజరాత్ అటవీ శాఖ, వంతారా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. స్థానికంగా శాకాహార జంతువులను తిరిగి ప్రవేశపెట్టడం ఆహార గొలుసును సమతుల్యం చేయడం, స్థానిక పర్యావరణం కోలుకునేలా సహాయపడటం దీని ప్రధాన ఉద్దేశ్యమని అటవీశాఖ, వంతారా తెలిపాయి. వంతారా బృందం ఈ కృష్ణ జింకలకు అత్యుత్తమ వైద్య పరీక్షలు, సురక్షితమైన రవాణా ఏర్పాట్లను చేసింది. కృష్ణ జింకలు వంటి శాకాహార జంతువులను తిరిగి తేవడం ద్వారా బన్నీ గడ్డిభూముల్లో విస్తృత జీవవైవిధ్యం పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. భవిష్యత్తులో మరిన్ని జంతువులను ప్రవేశపెట్టే ప్రణాళికలకు అనుకూలంగా పర్యావరణాన్ని సన్నద్ధం చేయడానికి ఇది ఎంతగానో సహాయపడుతుందని తెలిపింది.

# సంపాదకీయం

## హుందాతనం కోల్పోతున్న రాహుల్ !

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్దనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# పుస్తక వనం.. ఫ్యూచర్ లైబ్రరీ!




నార్వే రాజధాని ఓస్లో సమీపంలో 'నార్డ్‌మార్కా' అటవీ ప్రాంతంలోని వెయ్యి స్ప్రూస్ వృక్షాల వెనుక ఒక భావోద్వేగభరితమైన కథ దాగి ఉంది. ఇవి కలప కోసమో, నేటి వ్యాపార కాగితం కోసమో పెరుగుతున్న చెట్లు కావు. రాబోయే శతాబ్దంలో, అంటే 2114వ సంవత్సరంలో ముద్రించబోయే వంద రహస్య గ్రంథాలకు శ్వేత పత్రాలుగా మారేందుకు, ప్రకృతి ఒడిలో లాలించబడుతున్న అక్షర శిశువులు. ఈ ప్రకృతి సంపద.. భవిష్యత్ తరాల మేధస్సుకు కానుకగా ఇవ్వబోతున్న జీవ గ్రంథాలయం.

ఎక్కడికైనా సమాచారం క్షణాల్లో చేరిపోతున్న డిజిటల్ యుగమిది. ప్రతిదీ వేగంగా, తక్షణమే జరిగిపోవాలనుకునే ఈ ఆధునిక ప్రపంచంలో... ఒక కళాకారిణి మాత్రం శతాబ్దకాలం పాటు నిరీక్షించే ఓర్పును నమ్ముకుంది. స్కాట్లాండ్‌కు చెందిన ప్రఖ్యాత దృశ్య కళాకారిణి (ఎఱంఋశ్రీ ూతీఱర్) కేటీ పాటర్సన్ 2014లో 'ఫ్యూచర్ లైబ్రరీ' అనే ఈ అపూర్వ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఆమె ఆలోచన ప్రకారం, 2014 నుంచి ప్రతి ఏడాది ప్రపంచంలోని ఒక ప్రముఖ రచయిత లేదా రచయిత్రి ఒక సరికొత్త రచనను ఈ లైబ్రరీకి సమర్పిస్తారు. అయితే, ఆ రచనను చదివే హక్కు, ప్రచురించే హక్కు, కనీసం అందులో ఏముందో తెలుసుకునే హక్కు కూడా ఈ తరానికి లేదు. 2014 నుంచి 2114 వరకు... అంటే వందేళ్ల పాటు ప్రతి ఏటా సేకరించే వంద అద్భుత రచనలను ఒకేసారి ఆ నూరేళ్ల తర్వాతే ఒక మహా సంకలనంగా ముద్రిస్తారు. ఆ పుస్తకాల ముద్రణకు ఉపయోగించే కాగితాన్ని కూడా సమీప ఓస్లో అడవిలో పెంచుతున్న ఆ వెయ్యి స్ప్రూస్ చెట్ల నుంచే తయారు చేయాలన్నది సంకల్పం.

ఈ వందేళ్ల సాహిత్య యజ్ఞంలో భాగంగా ప్రతి ఏటా ఒక విశిష్ట రచయితను 'ఫ్యూచర్ లైబ్రరీ' బాధ్యులు ఎంపిక చేస్తారు. వారు భవిష్యత్ తరాలను, ఇంకా పుట్టని పాఠకులను ఊహిస్తూ తమ అంతరంగాన్ని అక్షరబద్ధం చేస్తారు. ఆ రచనను పూర్తి చేసిన తర్వాత, వారు దాన్ని ఎవరికీ చూపించకుండా, కేవలం హార్డ్ కాపీ రూపంలో ఒక పెట్టెలో పెట్టి సీల్ వేస్తారు. ఓస్లో ప్రాంతంలోనే ఉన్న డైక్‌మెన్ బ్యోర్వికా అనే ప్రజాగ్రంథాలయంలో ప్రత్యేకంగా నిర్మించిన 'సైలెంట్ రూమ్'లో వీటిని భద్రపరుస్తారు. అక్కడ రచయిత పేరు, శీర్షిక, ప్రచురించిన సంవత్సరం మాత్రమే సందర్శకులకు కనిపిస్తాయి. ఈ సాహిత్య యజ్ఞానికి మొదటి సమర్పకురాలిగా ప్రపంచప్రసిద్ధ కెనడియన్ నవలా రచయిత్రి, బుకర్ ప్రైజ్ విజేత మార్గరెట్ అట్వుడ్ ఎంపికయ్యారు. ఆమె 2014లో 'స్క్రిబ్లర్ మూన్' అనే ప్రచురితం కాని నవలను ఈ ప్రాజెక్టుకు అప్పగించారు.

ఆ తర్వాత డేవిడ్ మిచెల్, ఐస్లాండ్ కవి స్జోన్, టర్కిష్--బ్రిటిష్ రచయిత్రి ఎలిఫ్ షఫాక్, నోబెల్ బహుమతి గ్రహీత హాన్‌కాంగ్, ప్రఖ్యాత కవి ఓషన్ వువాంగ్, జింబాబ్వే రచయిత్రి త్సిత్సి దంగారెంబ్‌గాతో పాటు మన దేశం నుంచి అమితావ్ ఘోష్ కూడా ఉన్నారు. వీరంతా తమ అమూల్యమైన రచనలను ఈ అక్షర భాండాగారానికి అందించారు.

ఈ ప్రాజెక్టులో హృదయానికి హత్తుకునే అంశం ఏమిటంటే... ప్రకృతికి, సాహిత్యానికి మధ్య అల్లిన జీవ సంబంధం. నార్వే అడవిలో పెరుగుతున్న ఆ స్ప్రూస్ చెట్లు కాలాన్ని తమ వలయాలుగా మార్చుకుంటున్నాయి. మరోవైపు రచయితల మనసుల్లోని ఆలోచనలు కాగితాలపై అక్షరాలుగా మారి కాలానికి సవాలు విసురుతున్నాయి. నూరేళ్ల తర్వాత... ఈ చెట్లను నరికి కాగితంగా మార్చినప్పుడు, ఆ కాగితంపై ఈ వంద పుస్తకాలు ముద్రించబడతాయి. అంటే ఈ చెట్లు నూరేళ్ల తర్వాత పుస్తకాల రూపంలో మనుషులతో మాట్లాడతాయన్నమాట. ఎంతటి అద్భుతమైన భావన ఇది! ప్రకృతి, రచయిత, కాగితం, పాఠకుడు... ఈ నాలుగు అంశాల మధ్య శతాబ్ద కాలం పాటు సాగే ఒక అదృశ్య, అమర అనుబంధానికి ఈ ప్రాజెక్ట్ ఒక సజీవ సాక్ష్యం.

సాధారణంగా ఏ రచయిత అయినా తను రాసిన పుస్తకాన్ని సమాజం వెంటనే చదవాలని, విమర్శకులు మెచ్చాలని, పాఠకులు ఆదరించాలని కోరుకుంటారు. తాము బతికుండగానే ఆ కీర్తిని ఆస్వాదించాలని ఆరాటపడతారు. కానీ, ఫ్యూచర్ లైబ్రరీ కోసం రాస్తున్న రచయితలు మాత్రం ఆ ఆరాటాన్ని, కీర్తి కాంక్షను పక్కనపెట్టి, నిస్వార్థంగా కలం పడుతున్నారు. తాము రాసే అక్షరాలను తమ జీవితకాలంలో ఎవరూ చదవరు అని తెలిసి కూడా, వారు తమ గుండెల్లోని భావాలను కాగితంపై కుమ్మరిస్తున్నారు. ఇంకా జన్మించని భవిష్యత్ తరాల పాఠకులను మనసులో తలచుకుంటూ ఈ రచనలు చేస్తున్నారు. నేటి ప్రపంచం వేగానికి బానిస అయిపోయింది. ఇది టెక్నాలజీ సృష్టించిన మాయాజాలం. కానీ ఫ్యూచర్ లైబ్రరీ వీటన్నింటికీ భిన్నంగా, ఉద్దేశపూర్వకంగా 'వేచి ఉండడాన్ని' ఒక సంస్కృతిగా మార్చింది. అయితే ఈ ప్రాజెక్ట్ మనల్ని, మన సమాజాన్ని కొన్ని తీవ్రమైన ప్రశ్నల వైపు మళ్లిస్తుంది.

వందేళ్ల తర్వాత కూడా మానవాళి పుస్తకాలను ప్రేమిస్తుందా? అప్పటికి అసలు అడవులు మిగిలి ఉంటాయా? యంత్రాల యుగంలో మనుషులు కథలను, కవిత్వాన్ని ఆస్వాదించే హృదయాన్ని కలిగి ఉంటారా? ఈ వంద పుస్తకాలు వారికి ఒక అపూర్వ సాహిత్య సంపదగా కనిపిస్తాయా? లేక గత శతాబ్దపు మానవుల ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించే చారిత్రక పత్రాలుగా మిగిలిపోతాయా? లేదంటే ఒక అద్భుతమైన పర్యావరణ -- కళా ప్రయోగంగా కీర్తించబడతాయా? ఈ ప్రశ్నలన్నింటికీ కాలం మాత్రమే సమాధానం చెప్పగలదు.

# 'కార్మిక' గుర్తింపును తొలగించొద్దు



'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదోయ్..' అని మహాకవి శ్రీశ్రీ రాసినప్పుడు, అది కేవలం ఒక కవితా పంక్తి కాదు. మానవ నాగరికతను నిలబెట్టిన అసలు శక్తి ఎవరిదో ప్రకటించిన చారిత్రక సత్యం. ఈ ప్రపంచంలో రాజభవనాలు నిర్మించిన చేతులు రాజులవి కావు; చెమటతో రాళ్లను కరిగించిన కార్మికులవి. పర్వతాలను చీల్చి రహదారులు వేసింది శ్రమే. నదులపై వంతెనలు కట్టింది శ్రమే. భూమిని దున్ని ధాన్యం పండించింది శ్రమే. కర్మాగారాలను కదిలించి, సంపదను సృష్టించింది శ్రమే.

మనిషి చేతిలోని తొలి రాతి పనిముట్టు నుంచి నేటి కృత్రిమ మేధస్సు యుగం వరకు ప్రతి పురోగతి వెనుక నిలిచింది శ్రమే. అందుకే 'లేబర్' అనే పదం ఒక సాధారణ పరిపాలనా పదం కాదు. అది మానవ నాగరికతకు ప్రాణప్రదమైన చారిత్రక గుర్తింపు. అలాంటి చరిత్ర, పోరాటం, త్యాగాలను మోసుకొచ్చిన 'కార్మిక' అనే పదాన్ని తొలగించి, 'శక్తి' అనే కొత్త పేరును ప్రతిష్ఠించాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం ఇపుడు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. 18, 19వ శతాబ్దాల్లో పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని మార్చింది. యంత్రాలు పెరిగాయి, పరిశ్రమలు విస్తరించాయి. కానీ అదే సమయంలో కార్మికులపై దోపిడీ కూడా అమానుష స్థాయికి చేరుకున్నది. రోజుకు 14 నుంచి 16 గంటల పని, బాల కార్మిక వ్యవస్థ, కనీస వేతనాల లేమి, సామాజిక భద్రత లేకపోవడం ప్రపంచ కార్మిక వర్గాన్ని తిరుగుబాటుకు నెట్టాయి.

1886 మేలో అమెరికాలోని చికాగో నగరం ప్రపంచ కార్మిక చరిత్రలో అగ్నిగర్భ క్షణంగా నిలిచిపోయింది. 'ఎనిమిది గంటల పని-ఎనిమిది గంటల విశ్రాంతి-ఎనిమిది గంటల మనిషి జీవితం' అనే నినాదంతో లక్షలాది మంది కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఈరోజు మనం పొందుతున్న ఎనిమిది గంటల పని హక్కు, కనీస వేతనాలు, వారాంతపు సెలవులు, సామాజిక భద్రత-ఖశ్రీశ్రీ ష్ట్రవంవ ఖతీవ్ష్ట్రవ టతీబఱం శీట షశీతీఎవతీం' ర్‌తీబస్త్రస్త్రశ్రీవం. అందుకే 'లేబర్' అనే పదం ఒక శాఖ పేరు కాదు; అది ఒక చరిత్ర, ఒక స్ఫూర్తి, ఒక వర్గ చైతన్యం.

భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని కూడా కేవలం రాజకీయ నాయకుల చరిత్రగా మాత్రమే చూడలేం. బొంబాయి టెక్స్‌టైల్ కార్మికులు, రైల్వే కార్మికులు, గనుల కార్మికులు, నౌకాశ్రయ కార్మికులు బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని కుదిపేశారు. సమ్మెలు చేశారు. జైలు శిక్షలు అనుభవించారు. ప్రాణత్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన గొప్ప శక్తుల్లో కార్మిక వర్గం ఒకటి. అలాంటి చారిత్రక వారసత్వాన్ని మోస్తున్న 'కార్మిక' అనే పదాన్ని తొలగించడం అంటే చరిత్రను మరచిపోవడమే.

ప్రపంచవ్యాప్తంగా 'లేబర్' అనే పదానికి ప్రత్యేక గౌరవం ఉన్నది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పడిన సంస్థ పేరు కూడా భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ 'కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ' అనే పేరునే కొనసాగిస్తున్నది. దేశ రాజ్యాంగం కూడా సామాజిక, ఆర్థిక న్యాయాన్ని లక్ష్యంగా నిర్దేశించింది. కార్మిక సంక్షేమ చట్టాలు, కనీస వేతన చట్టాలు, సామాజిక భద్రతా పథకాలు అన్నీ 'లేబర్' అనే భావన చుట్టూనే రూపుదిద్దుకున్నాయి. అయితే తెలంగాణలో మాత్రమే ఈ చారిత్రక పదాన్ని మార్చాల్సిన అవసరం ఎందుకో?

కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.97, తేదీ 16-06-2026 ద్వారా 'కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ' పేరును పేరుతో 'శక్తి'గా మార్చడం కేవలం నామకరణ సమస్య కాదు. ఇది ఒక భావజాల ప్రశ్న. పదాలు కేవలం పదాలు కావు. అవి చరిత్రను, విలువలను, వర్గ అస్తిత్వాన్ని మోస్తాయి. 'కార్మిక' అనే పదం శ్రమను కేంద్రంగా చూస్తుంది. కానీ 'శక్తి' అనే పదం అస్పష్టమైనది. అది కార్మిక చరిత్రను ప్రతిబింబించదు. కార్మిక హక్కుల పోరాటాలను గుర్తుచేయదు. ప్రపంచ కార్మిక వర్గం సాధించిన చారిత్రక విజయాలను సూచించదు. ఒకవేళ ఎప్పుడైనా వ్యవసాయ శాఖ పేరును మార్చితే? గిరిజన శాఖ పేరును మార్చితే? స్త్రీ సంక్షేమ శాఖ పేరును మార్చితే? ఆ వర్గాల ప్రత్యేక గుర్తింపు ఏమవుతుంది? అలాగే కార్మిక శాఖ అనే చారిత్రక గుర్తింపును ఎందుకు తొలగించాలి?

ప్రతి మే డే రోజున కార్మికులను కొనియాడుతాం. ప్రజాప్రతినిధులు చీపుర్లు పట్టుకొని శ్రమకు గౌరవం ఉందని చెప్తారు. ప్రభుత్వాలు 'శ్రమశక్తి' అవార్డులు ఇస్తాయి. కానీ అదే సమయంలో 'కార్మిక' అనే పదాన్నే తొలగిస్తే అది విరుద్ధ చర్య కాదా? శ్రమను గౌరవించడం అంటే కార్మికుడి చరిత్రను గౌరవించడం. కార్మికుడి గుర్తింపును కాపాడటం. కార్మికుడి పేరును చెరిపేసి శ్రమకు గౌరవం ఇవ్వలేం.

ఈ భూమిపై ప్రతి ఇటుక వెనుక ఒక కూలీ చేతి ముద్ర ఉన్నది. ప్రతి పంట వెనుక రైతు చెమట ఉన్నది. ప్రతి పరిశ్రమ వెనుక కార్మికుడి జీవితం ఉన్నది. కూలీ లేకుండా సంపద లేదు. శ్రమ లేకుండా నాగరికత లేదు. కార్మికుడు లేకుండా అభివృద్ధి లేదు. సామ్రాజ్యాలు కూలిపోయాయి. రాజ్యాలు మారిపోయాయి. అధికారాలు వచ్చాయి, పోయాయి. కానీ ప్రపంచాన్ని నిలబెట్టింది మాత్రం శ్రమే.

శ్రమను మరచిపోయిన సమాజం తన మూలాలను మరచిపోతున్నది. కార్మికుడి గుర్తింపును చెరిపివేసిన సమాజం తన భవిష్యత్తునే చెరిపివేసుకుంటున్నది. 'కార్మిక' అనే పదం కేవలం ఒక పేరు కాదు. అది చికాగో అమరవీరుల రక్తం. అది బొంబాయి కార్మిక సమ్మెల జ్ఞాపకం. అది భారత స్వాతంత్ర్య పోరాటపు నినాదం. అది ప్రపంచ కార్మిక వర్గపు గౌరవ చిహ్నం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.97ను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉన్నది. 'కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ' అనే చారిత్రక పేరును యథాతథంగా కొనసాగించాలి. ప్రపంచాన్ని నడిపేది అధికారం కాదు, శ్రమే. చరిత్రను సృష్టించేది రాజులు కాదు, కార్మికులు. శ్రమను గౌరవిద్దాం. కార్మిక చరిత్రను కాపాడుకుందాం. కార్మికుడి గుర్తింపును నిలబెట్టుకుందాం. శ్రమే సృష్టికి మూలం. కార్మికుడే నాగరికతకు నిర్మాత!

# అర్ధ శతకంతో మెరిసిన జురెల్..
# టీమిండియా భారీ స్కోర్..!

గాలే టెస్టులో తొలి రోజే పటిష్ట స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు తడబడింది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా.. మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే.. టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167 : 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా.. చూస్తుండగానే రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ.. ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్.. డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు.

అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా.. జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.



## స్పోర్ట్స్

## ఫైనల్లో కంగుతిన్న సన్‌రైజర్స్.. హండ్రెడ్ ట్రోఫీని ముద్దాడిన ట్రెంట్ రాకెట్స్..!



మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్(రాబఅతీఅంవతీం ూవవసం)ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్. చిన్నపాటి లక్ష్యాన్ని 54 బంతుల్లోనే ఊఫ్‌మనిపించింది గార్డ్‌నర్ బృందం. 92 పరుగుల ఛేదనలో ఓపెనర్లు సోఫియా డంక్లే(41), బేత్ మూనీ(31 నాటౌట్)లు శుభారంభమిచ్చారు. సన్‌రైజర్స్ బౌలర్లను ఎడాపెడా ఉతికేసిన ఈ ద్వయం బౌండరీతో స్కోర్‌బోర్డును ఉరికించింది. డంక్లే, నాట్ సీవర్ బ్రంట్(4)లు ఔటైనా.. కెప్టెన్ అష్లే గార్డ్‌నర్(9 నాటౌట్)తో కలిసి రాకెట్స్‌ను తొలిసారి హండ్రెడ్ లీగ్ విజేతగా నిలిపింది మూనీ.

### రెండో అత్యల్ప స్కోర్

లీగ్ దశలో సంచలన ఆటతో ఫైనల్ చేరిన సన్‌రైజర్స్ లీడ్స్ ఆఖరి మెట్టుపై తడబడింది. ఫామ్‌లో ఉన్న ఫొబే లిచ్‌ఫీల్డ్(10) సహా, మిడిలార్డర్ బ్యాటర్లు విఫలమవ్వడంతో అనూహ్యంగా 91 పరుగులకే ఆలౌటైంది. రాకెట్స్ బౌలర్లలో కిమ్ గార్త్(2-18), సమంతా బేట్స్(2-17), చార్లీ ఫిలిప్స్(2-12)లు రెండేసి వికెట్లతో రాణించగా.. సథర్‌లాండ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఫలితంగా డానియల్ గిబ్సే సారథ్యంలోని ఆరెంజ్ ఆర్మీ ఈ లీగ్ ఫైనల్లో రెండో అత్యల్ప స్కోర్ నమోదు చేసింది.

## ప్చ్.. చైనాతో డ్రా.. బోణీ అవకాశం చేజారిందిలా..!

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌ను భారత జట్టు డ్రాతో ఆరంభించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత చైనాతో ఆదివారం హోరాహోరీ మ్యాచ్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియా ఆఖర్లో పట్టుసడలించింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో మన జట్టు గెలవాల్సిన మ్యాచ్ కాస్త డ్రాగా ముగిసింది. భారత్ తరఫున నవ్‌నీత్, దీపికలు చెరొక గోల్‌తో రాణించారు. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల జట్టు అదిరే బోణీ కొట్టగా.. మహిళలు మాత్రం డ్రాతో సరిపెట్టుకున్నారు. వాగ్నర్ హాకీ స్టేడియంలో ఆదివారం చైనాను నిలువరించడంలో విఫలమైన టీమిండియా 2-2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే నేహ అందించిన పాస్‌ను నవ్‌నీత్ మెరుపు వేగంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపింది. అయితే.. 15వ నిమిషంలో ఝూంగ్ ఇంగ్ చైనాకు తొలి గోల్ అందించగా స్కోర్ 1-1తో సమం అయింది. రెండో అర్ధ భాగంలో దీపిక డ్రాగ్ ఫ్లిక్ గోల్‌తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆపై బంతిపై నియంత్రణ కోల్పోయింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.





గ్లామరస్ సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటున్న మౌనీ రాయ్

# దుల్కర్ వెనక్కి తగ్గితే అసలు లాభం ఎవరికి?



సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. భారీ అంచనాలతో రిలీజ్ డేట్స్ ప్రకటించిన సినిమాలు, చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కారణంగా వాయిదా పడుతున్నాయి. ఇప్పుడు దుల్కర్ సల్మాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఐ యామ్ గేమ్ కూడా అదే లిస్ట్ లో చేరే అవకాశంపై మాలీవుడ్‌లో డిస్కషన్ జరుగుతోంది. ఆగస్టు 20, 2026న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తికాకపోవడంతో రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందనే ప్రచారం ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.

ఇది కేవలం ఒక సినిమా పోస్ట్ పోన్ మాత్రమే కాదు. పెద్ద సినిమాల రిలీజ్ ప్లాన్స్ ఎలా మారుతున్నాయనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. గతంలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన తర్వాత దానిని మార్చడం అరుదుగా జరిగేది. కానీ ఇప్పుడు యాక్షన్ థ్రిల్లర్లు, విజువల్ ఎఫెక్ట్స్ ఆధారిత సినిమాలు, బహుభాషా రిలీజులతో పోస్ట్ ప్రొడక్షన్ దశ మరింత క్లిష్టంగా మారింది. డబ్బింగ్, డీఐ, సౌండ్ డిజైన్, వీఎఫ్ఎక్స్, సెన్సార్ ప్రక్రియల సమన్వయం కారణంగా ఆఖరి దశలో ఆలస్యాలు పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.ఐ యామ్ గేమ్ పోస్ట్ పోన్ అయితే దాని ఎఫెక్ట్ బాక్సాఫీస్ ఈక్వేషన్స్ పై కూడా కనిపించే అవకాశం ఉంది. అదే రోజున రిలీజ్ కు రెడీ అవుతున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఖలీఫాకు సోలో రిలీజ్ అడ్వాంటేజ్ దక్కే అవకాశముంటుంది. స్క్రీన్ కౌంట్ పెరగడం, మంచి ఓపెనింగ్స్ రావడం వంటి అంశాలు దానికి అనుకూలంగా మారవచ్చు. మరోవైపు మమిత బైజు నటించిన బేతేళం కుడుంబ యూనిట్‌కు కూడా మల్టీప్లెక్స్ పోటీ తగ్గి ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఎక్కువ షేర్ దక్కే అవకాశాలు పెరుగుతాయి.దీంతో ఆగస్టు 20 మాలీవుడ్ బాక్సాఫీస్ ఈక్వేషన్ పూర్తిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. మూడు సినిమాల మధ్య పోటీ ఉండాల్సిన చోట, రెండు సినిమాల మధ్య ప్రధాన పోటీకి పరిస్థితి చేరుకోవచ్చు. ఈ మార్పు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, థియేటర్ చైన్ల స్క్రీన్ కేటాయింపులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పాన్ ఇండియా మార్కెట్ టార్గెట్ గా రిలీజవుతున్న సినిమాల సంఖ్య పెరగడం కూడా ఈ ట్రెండ్‌కు మరో కారణంగా కనిపిస్తోంది.ఒకేసారి మలయాళం, తెలుగు, తమిళం, హిందీ మార్కెట్లను టార్గెట్ గా చేసుకోవడం వల్ల ప్రతి వెర్షన్‌ను ఒకే స్థాయిలో రెడీ చేయాల్సి వస్తోంది. ఫలితంగా రిలీజ్ డేట్ కంటే క్వాలిటీకు ప్రాధాన్యం ఇస్తూ నిర్మాతలు చివరి నిమిషంలో కూడా డెసిషన్స్ మార్చేందుకు వెనుకాడటం లేదు. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇంకా రానప్పటికీ, ఐ యామ్ గేమ్ చుట్టూ జరుగుతున్న డిస్కషన్ ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. భారీ సినిమాల యుగంలో పోస్ట్ ప్రొడక్షన్ ఇప్పుడు కేవలం టెక్నికల్ దశను కాదు, రిలీజ్ ప్లాన్ ను డిసైడ్ చేసే కీలక అంశంగా మారుతోంది.



స్టైలిష్ కార్సెట్ మరియు బ్లేజర్ లుక్‌లో ఆకట్టుకుంటున్న జహ్రా ఎస్. ఖాన్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com